




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 182 పేజీలు: 10+4 వెల: 6.50










శుక్రవారం హెలిప్యాడ్ నుంచి గూడెంచెరువు ప్రజావేదిక వద్దకు ఆటోలో బయలు దేరిన సీఎం చంద్రబాబు

# 2029కి స్టీల్‌ప్లాంట్ పూర్తి

>> సీమలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసి ఉద్యాన హబ్‌గా మారుస్తామన్నారు. శనివారం రైతు ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నిధులను జమచేయనున్నట్లు ప్రకటించారు. ఈ రకరంగా అన్నదాతను అన్ని విధాల ఆదుకుంటున్నామని, ఏది రైతు ప్రభుత్వమో, ఏది రైతు వ్యతిరేక ప్రభుత్వమో ఆలోచించుకోవాలని కోరారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రాన్ని ఏమైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా తేలికని, నిలబెట్టడం చాలా కష్టమని జగన్ హయాంలో విధ్వంసం జరిగిందన్నారు. పది లక్షల కోట్లు అప్పు చేశాడే తప్ప రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. జగన్ ఘరానా మోసగాడని విమర్శించారు. గాడిలో పెట్టడంతోపాటు సంపద సృష్టిస్తున్నామని తెలిపారు. పి4 విధానం ద్వారా పేదలకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ల పంపిణీ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. గతంలో ఒక్క నెలలో పింఛను తీసుకోకుంటే రద్దు చేసేవారని, తమ ప్రభుత్వంలో అలా చేయడం లేదని ఇంటి దగ్గర అందుబాటులో లేనివారిని ఎక్కడున్నా వెతికి వారికి ఇచ్చే బాధ్యత తీసుకుంటున్నామన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో జాతీయ రహదారుల్లో గుంతలు కూడా పూడ్చలేదని, తాము అధికారంలోకి వచ్చాక రూ.2000 కోట్లతో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామన్నారు. ఏడాదిలో రూ.2000 కోట్లు రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ నెల 7వ తేదిన చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేది నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని స్త్రీశక్తి పథకం ద్వారా అమలు చేసి మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కొవ్వూరు మహిళా ఎమ్మెల్యేపై అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమర్థించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిని మందలించాల్సింది పోయి రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు తప్పు చేస్తే వారిని మందలించాలని, సమర్థిస్తే వారు మరింతగా రెచ్చిపోతారని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలో ప్రజాసేవలో కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. అంతకుముందు హెలికాప్టర్ దిగి ఆటోలో ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, కలెక్టర్ చెరుకూరు శ్రీధర్, పలువురు నేతలు అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

>> ప్రకటించింది. ఆగస్టు 21 లోపు నామినేషన్ల సమర్పించవచ్చని ఈసీ ప్రకటించింది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ ఆగస్టు 7, నామినేషన్ల సమర్పణకు తుది గడువు ఆగస్టు 21, నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఆగస్టు 22, నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఆగస్టు 25, పోలింగ్ సెప్టెంబర్ 9 (ఉదయం 10 నుంచి సాయంత్రం 5వరకు), కౌంటింగ్‌తోపాటే ఫలితాలను వెల్లడిస్తారు. కాగా సెప్టెంబర్ 9 ఎలక్టోరల్ కాలేజ్ ఖరారు. మరోవైపు ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎలక్టోరల్ కాలేజీ జాబితా ఖరారైనట్టు ఇప్పటికే ఇసి ప్రకటించింది. అలాగే నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఇసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఎలక్టోరల్ కాలేజీ జాబితా కొనుగోలుకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. త్వరలోనే ఎలక్టోరల్ కాలేజీ జాబితా ప్రకటిస్తామని తెలిపింది. ఇక ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహణకుగాను రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీ ఇటీవల నియమితులయ్యారు. న్యాయ మంత్రిత్వ శాఖను సంప్రదించడంతో పాటు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ సమ్మతి మేరకు ఇసి నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు ఇదిలా ఉండగా, ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డిఎ కూటమి ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వస్తున్నాయి. జెడియు నేత, కేంద్రమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నట్లు ప్రచారం మొదలైంది. అయితే, దీన్ని బిజెపి విశ్వసనీయ వర్గాలు తోసిపుచ్చాయి. తదుపరి ఉప రాష్ట్రపతిగా బిజెపి చెందిన నేతనే ఎన్నుకోనున్నట్లు వెల్లడించాయి. విపక్షాలు కూడా ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్ట నున్నాయని ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అనూహ్యంగా పదవికి రాజీనామా చేశారు. కాగా బీహార్‌నుంచే వచ్చిన ప్రస్తుత రాజ్యసభ ఉపఛైర్మన్ హరివంశ్‌నారాయణ్‌కే పదవి దక్కుతుందని చెపుతున్నారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్రం ఈనిర్ణయం తీసుకోవచ్చని బలంగా వినిపిస్తోంది. బిజెపి వర్గాలనుంచి అయితే ఈసారి ఖచ్చితంగా బిజెపికి చెందిన వారినే ఎన్నుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు పేర్కొంటున్నారు. రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ధన్‌ఖడ్ ముందుగానే వైదొలిగారు. అనారోగ్య కారణాలతో తప్పుకుంటున్నట్లు రాష్ట్ర పతికి లేఖరాసిన ఆయన తక్షణమే రాజీనామా అమల్లోకి వచ్చేలా చూడాలని కోరారు. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదం లభించగా తాజాగా ఇసి ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది.

# భగవంత్ కేసరి

>> గ్రఫీలో హనుమాన్ సినిమా అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయరచయితగా బలగంలో 'ఊరు పల్లెటూరు' పాటకుగాను కాసర్ల శ్యామ్ అవార్డును సొంతంచేసుకున్నారు. ఉత్తమ తమిళ చిత్రంగా పార్కింగ్‌కు అవార్డు వరించింది. తొలుత నాన్ ఫీచర్ చిత్రాల కేటగిరీ అవార్డులను కేంద్రం ప్రకటించింది.

ఉత్తమ మ్యూజిక్ దర్శకత్వంలో తమిళచిత్రం వాతి జివి ప్రకాష్‌కుమార్.
ఉత్తమ నేపథ్యయ సంగీతం : యానిమల్ హార్షవర్థన్ రామేశ్వర్
బెస్ట్‌మేకప్: సామ్‌బహదూఊర్ (హిందీ) శ్రీకాంత్ దేశాయ్
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: 2018: ఎవ్రీవన్ ఈజ్ ఏ హీరో (మళయాళం) మోహన్‌దాస్
బెస్ట్ ఎడిటింగ్: పూక్కాలమ్(మలయాళం)మిథున్ మురళి
బెస్ట్ సౌండ్ డిజైన్: హింది యానిమల్‌లో సచిన్ సుధాకరన్, హరిహరన్‌మురళీధరన్
బెస్ట్ స్క్రీన్‌ప్లే ఒరిజినల్: బేబి(తెలుగు) సాయిరాజేశ్ నీలం
బెస్ట్ స్క్రీన్‌ప్లే(ఒరిజినల్) పార్కింగ్(తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్
ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్‌ఏక బందా కాఫీహై(హిందీ) దీపక్ కింగ్రానీ
ఉత్తమ సినిమాటోగ్రఫీ: దికేరళ స్టోరీ(హిందీ) వసంతను మొహాపాత్రో
ఉత్తమ నేపథ్యగాయని: జవాన్‌లో (చెలియా పాటకు శిల్పారావు
ఉత్తమ నేపథ్యగాయకుడు : బేబి (పివిఎన్‌ఎస్ రోహిత్)
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీ తాత చెట్టు(సుకృతివేణి), జిప్సీ(మరాఠి)కబీర్‌ఖందారి నాల్-2, త్రిషథోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్‌దీప్‌లు ఎంపికయ్యారు.
ఉత్తమ సహాయ నటి: ఉల్లుకు(మళయాళం) ఊర్వశి, నష్(గుజరాతి) జానకీ బోడివాలా
ఉత్తమ సహాయనటుడుగా పూకానకలం(మలయాళం), విజయరాఘవన్, పార్కింగ్(తమిళం), ముత్తుపెట్టాయ్ సోముభాస్కర్‌లను వరించింది.
ఉత్తమ బాలలచిత్రం: నాల్ (మరాఠి)
ఉత్తమ జాతీయ సమగ్రత సామాజిక విలువలచిత్రం: శామ్ బహాదూర్(హిందీ)
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణికి ప్రేమ్‌కహానీ(హిందీ)
ఉత్తమ పరిచయ దర్శకుడుగా : ఆత్మపాంప్లెట్(మరాఠి)చిత్రం ఆశిష్ బెండే
ఉత్తమ ఫీచర్ ఫిలింగా : 12త్ ఫెయిల్

ఇక నాన్‌ఫీచర్ ఫిలింకేటగిరీలో క్రానికల్ ఆఫ్ ప్యాటీమాన్ మళయాళచిత్రం నేకల్, ఒడియాచినరతం ది సీ అండ్‌సెవెన్ విలేజెస్, కన్నడ చిత్రం సన్‌ఫ్లవర్స్ వోర్‌ది ఫస్ట్‌వన్స్‌టునో బెస్ట్ స్క్రిప్ట్ అవార్డును సొంతంచేసుకున్నాయి. బెస్ట్ వాయిస్ ఓవర్‌కు ది సేక్రెడ్ జాక్ ఇంగ్లీషు చినరతం, బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్ హిందీచినరతం ది ఫస్ట్ ఫలిమ్, ఇంగ్లీషు చిత్రం బెస్ట్ ఎడిటింగ్‌కు మూవీంగ్‌ఫోకస్, బెస్ట్ సౌండ్ డిజైన్‌కు హిందీచిత్రం దుందగిరి కేపూల్, బెస్ట్ సినిమాటోగ్రఫీకి తమిళ చిత్రం లిటిల్ వింగ్స్, బెస్ట్ డైరెక్షన్ విభాగంలో హిందీ చిత్రం ది ఫస్ట్ ఫిలిమ్, బెస్ట్ ఎడిటింగ్‌లో ఇంగ్లీస్ చిత్రం మూవింగ్ ఫోకస్, బెస్ట్ ఆర్ట్, కల్చర్ చిత్రంగా ఇంగ్లీష్ చిత్రం టైమ్‌లెస్ తమిళనాడు, బెస్ట్ బయోగ్రాఫికల్ సినిమాగా ఒడిశాకు చెందిన మాబావు, మాగావ్, లెంటినో ఓవో ఎలైట్ అన్‌ది ఈస్ట్రన్ హారిజన్(ఇంగ్లీష్), ఉత్తమ పరిచయ దర్శకుడుగా మిజో చిత్రం మావ్ ది స్పిరిట్‌డ్రీమ్స్ ఆఫ్ చెరా, బెస్ట్ నాన్‌ఫీచర్‌ఫిలిమ్‌గా ఫ్లవరింగ్‌మ్యాన్ హిందీచిత్రానికి దక్కాయి.

## మెగా డీఎస్సీ ఫైనల్‌కీ విడుదల

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మెగా డీఎస్సీ ఫైనల్ కీ విడుదలైందని డీఎస్సీ కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్‌లో కీని అందుబాటులో ఉంచారు. అభ్యర్దుల నుంచి ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను స్వీకరించారు. విషయం నిపుణుల బృంద ఈ అభ్యంతరాలను క్షణంగా పరిశీలించి తుదికీని రూపొందించినట్లు కన్వీనర్ తెలిపారు. ఫైనల్ కీపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించడంలేదని పేర్కొన్నారు.

# తిరుమలలో కేంద్రమంత్రి గడ్కరీ

**తిరుమల,ఆగస్టు 1ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి విశ్రాంతిభవనం సముదాయం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రి బసచేసి శనివారం వేకువజామున స్వామివారిని దర్శించుకోనున్నారు.



శుక్రవారం తిరుమల విచ్చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న అదనపు ఇఒ వెంకయ్య చౌదరి

# ఇక ఎప్పటికప్పుడే గోవిందుని దర్శనం

>> దర్శనం కల్పించే సౌకర్యం శుక్రవారం నుండి మొదలైంది. ఉదయం 10గంటలనుండి 800 టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీచేసిన తరువాత శ్రీవాణి కౌంటర్లు మూసివేస్తారు. అలాగే రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు జారీఅవుతాయి. ఈ టిక్కెట్ పొందిన భక్తులందరికీ సాయంత్రం 4.30గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నుండి అనుమతిస్తారు. ఈ నూతన ప్రయోగాత్మక విధానం శుక్రవారం సాయంత్రం విజయవంతంగా అమలుచేశారు. ఉదయం 9.30గంటలకు కొందరు భక్తులు తిరుమలలోని అన్నమయ్యభవనం సమీపంలోని శ్రీవాణి టిక్కెట్లు జారీ కౌంటర్ వద్దకు వచ్చారు. వీరందరినీ 10గంటలకు అనుమతించడంతో సాఫీగా ,సులభంగా క్యూలైన్లలో చేరుకుని టిక్కెట్లను అందుకున్నారు. మధ్యాహ్నం 1గంటకే 800 టిక్కెట్లు జారీఅయ్యాయి. నూతన విధానం బావుందని, భక్తులు కూడా ప్రశాంతంగా,సాఫీగా వచ్చి టిక్కెట్లు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం భక్తులను అనుమతించే విధానం,కౌంటర్లలో సిబ్బంది టిక్కెట్లు జారీని స్వయంగా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షించారు. భక్తులకు చిన్నపాటి అసౌకర్యం లేకుండా నూతన కౌంటర్లు,నూతన విధానం చక్కగా అమలుచేసేలా చూస్తున్నారు .ఇది వరకు ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న శ్రీవాణి టిక్కెట్ల భక్తులను ఉదయం 10.15గంటలకు అనుమతించి మధ్యాహ్నం 12గంటల వరకు దర్శనం చేయించేవారు. ఇప్పుడు నూతన విధానంలో ప్రయోగాత్మకంగా ఉదయం టిక్కెట్లు అందుకున్న భక్తులకు సాయంత్రం ఏడుకొండలస్వామి దర్శనం చేయించేలా అమలుచేస్తున్నారు. ఏరోజుకారోజు శ్రీవాణి టిక్కెట్లు జారీచేస్తారు. వారందరికీ సాయంత్రం 4.30గంటలకు శ్రీవారి దర్శనభాగ్యం కల్పిస్తారు. 10గంటల నుండి టిక్కెట్లు జారీముగిసే వరకు అందుబాటులో ఉన్న శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ టిక్కెట్ల సమాచారాన్ని డిజిటల్ స్క్రీన్ల ద్వారా తెలియజేస్తున్నారు.

# కొత్త ఎక్సైజ్ విధానంపై చర్చలు

>> కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ప్రస్తుతం అమలులో ఉన్న 2022-25 బార్ పాలసీపై సమగ్రంగా వివరించారు. ప్రస్తుత పాలసీ క్రింద రాష్ట్రంలో 840 స్టాండలోన్ బార్లు, 50 స్టార్ హోటల్స్, మైక్రోబ్రూరీస్ లాంటి సంస్థలకు లైసెన్సులు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే 44 బార్ లైసెన్సులు గడువు ముగిసిన తర్వాత రిన్యూవల్ కాలేదని తెలియజేశారు. పక్కటి రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ మరియు కేరళల బార్ విధానాలపై పోలికలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. సాధారణ పరిపాలన (రాజకీయం), ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా వివిధ సంఘాల నుంచి వచ్చిన అభిప్రాయాలను మంత్రులకు వివరించారు. రాష్ట్ర వైన్ డీలర్లు, స్టార్ హోటల్‌ల అసోసియేషన్‌లు, హోటల్ యజమానుల సమాఖ్యల నుండి వచ్చిన వినతులను సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. గతంలో పాటించిన బార్ లైసెన్సింగ్ విధానాలు, వాటి ప్రభావం, కొత్త విధానాల్లో ఆర్థిక ప్రయోజనాలు ఎలా ఉండబోతున్నాయన్నదాని గురించి వివరించారు. ఎక్సైజ్‌శాఖ మరింతగా ఆలోచించి, పాలసీ రూపకల్పనను ముందుకు తీసుకెళ్తుందని ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తదుపరి సమావేశంలో నూతన విధానాన్ని సమీక్షించి, తుది నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు. ఈ సమావేశానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, అదనపు కమిషనర్ దేవకుమార్, జాయింట్ కమిషనర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

02-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.7.23
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.9.57-11.44
దు.తె.5.49-7.28
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

మేషం:తండ్రి తరపు నుండి ఆస్తి లాభం పొందే సూచన, కోర్టు వివాదాలు పరిష్కారమవుతాయి.

వృషభం: వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ఆటంకాలు తొలుగుతాయి.

మిథునం: కష్టానికి ఫలితం దక్కుతుంది. పెండింగ్ పనులు పూర్తికాగలవు. పట్టుదలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

కర్కాటకం:గృహనిర్మాణాలు వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు సాగిస్తారు. అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి.

సింహం: ఉద్యోగ, విద్యావకాశాలు లభిస్తాయి. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

కన్య : కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

తుల : షేర్లు, భూముల క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

వృశ్చికం: కొత్త ఒప్పందాలలో తొందరపాటు వద్దు. కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

ధనుస్సు: వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు.

మకరం: వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఉద్యోగులకు కొంత ప్రోత్సాహం లభిస్తుంది.

కుంభం: షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

మీనం : నూతన పరిచయాలు పెరుగుతాయి వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన ధైర్యంతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 3 కీలక జాతీయ రహదారులు అనుసంధానం

>> గురించి బందరు ఎంపీ బాలశౌరి స్పెషల్ రిపోర్టుని రూపొందించి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వివరించారు. కృష్ణా జిల్లాలో ప్రస్తుతం అత్యంత ప్రమాదకర రహదారి అంటే గుడివాడ కంకిపాడు మధ్య ఉన్నదే. ఎన్‌హెచ్‌లు 165, 65, 216ఈ మూడు నేషనల్ హైవేలను కలిపే అత్యంత కీలకమైన రహదారి ఇది. గుడివాడ నుంచి విజయవాడకు వెళ్లేందుకూ ఈ రహదారి ఎంతో ముఖ్యం. ప్రస్తుతం ఇక్కడున్న ఇరుకైన రోడ్డుకి పక్కనే పంట కాలువ ఉండడంతో, ఎప్పుడూ దెబ్బతింటూనే ఉందనీ, నిత్యం వేలాదిమంది ప్రజలు తల్లడిల్లుతున్నారని కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ బాలశౌరి వివరించారు. అందుకే ఇక్కడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అలైన్‌మెంట్ సర్వే సైతం పూర్తయిందనీ, వీలైనంత త్వరగా పీఎం గతిశక్తి పథకం కింద నిధులు మంజూరు చేయాలని ఎంపీ బాలశౌరి కోరారు గుడివాడపట్టణ పరిధిలో 216బీ నేషనల్ హైవే విస్తరణ పనులకు ఈ వార్షిక ప్రణాళికలో 18.50కోట్ల రూపాయల అంచనాతో ఇప్పటికే ప్రతిపాదనలు పెట్టామనీ, వాటిని సైతం మంజూరు చేయాలంటూ గడ్కరీకి ఎంపీ బాలశౌరి విజ్ఞప్తి చేశారు. విస్తరణ జాప్యంతో వాహనదారులు నిత్యం కష్టాలు పడుతున్నారని వివరించారు. అదే విధంగా మచిలీపట్నం పోర్టు నుంచి విబీ65 జాతీయ రహదారి వరకు ప్రతిపాదించిన 18.5కిలోమీటర్ల 6 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 350 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గుడివాడలో విబీ165, విబీ 216బీ మధ్య అనుసంధానానికి మరో 28.53 కోట్ల రూపాయలతో డీపీఆర్‌ను మోర్త్‌కు సమర్పించామని దానిని సైతం మంజూరు చేయాలని కోరారు.మచిలీపట్నం, మంగినపూడి బీచ్‌మధ్యలో 11.07 కిలోమీటర్ల రోడ్డుని 4వరుసలుగా విస్తరించడంతో పర్యాటకానికి ఊతం ఏర్పడుతుందని ఎంపీ బాలశౌరి వివరించారు. మచిలీపట్నం పోర్టు పూర్తయితే దానికి అనుసంధానంగా 350 కోట్ల రూపాయలతోప్రతిపాదించిన 18.5 కిలోమీటర్ల 6వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి చాలా అవసరమని ఎంపీ బాలశౌరి వివరించారు. 7 అండర్‌పాస్‌లు, 4ఫ్లైఓవర్లనెల నిర్మాణం దీనిలో భాగంగా చేపట్టనున్నారు. వీటిలో ఫ్లైఓవర్ బీచ్ రోడ్డులో నిర్మించనున్నారు.

# అన్నదాతా సుఖీభవ పథకానికి నిధులు జమ

>> 831.51కోట్ల రూపాయలను రైతులకు సాయంగా అందించనుంది. అంటే ఆగస్టు 2వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.7,000 జమ చేస్తాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అందించే సాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 అందిస్తామని కూటమి ఎన్నికల వేళ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. పీఎం కిసాన్ పథకంలో ఏడాదికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000 సాయానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ కింద మరో రూ.14,000కలిపి అందజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి రెండు విడతల్లో రూ.5,000 చొప్పున, మూడో విడతలో రూ.4,000 ఇవ్వనుంది. అన్నదాతా సుఖీభవ్వకు సంబంధించి 59,750 వినతులు నమోదు కాగా 58,464 అప్లికేషన్ లను పరిష్కరించారు. ఈ పథకంపై సందేహాల నివృత్తికి ప్రభుత్వం 155251 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో తీసుకొచ్చింది.

# ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

>> జలాశయం గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిలు కాగా గురువారం రాత్రి 8 గంటలకు 297.72 టిఎంసిలుగా నమోదైంది. సాగర్ నుంచి పులిచింతలకు 2,09,404 క్యూసెక్కుల నీరు వస్తోంది. అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీకి వరద తీవ్రత కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి 2,65,909 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు.కృష్ణానదిలో వరద స్థిరంగా కొనసాగుతోందని, ముప్పేమీ లేదని, అయినా జిల్లా అధికార యంత్రాంగాన్ని, నదీ పరివాహకంలోని లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని కలెక్టర్‌లక్ష్మీశ స్పష్టం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోందని, రానున్న రెండు రోజుల్లో ప్రకాశంబ్యారేజీకి మూడు లక్షల క్యూసెక్కుల నీరువచ్చే అవకాశం మాత్రమే ఉందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని హితవు పలికారు.

## రిమాండ్ పొడిగింపు

>> ఎక్కడెక్కడ కలిశారో అక్షాంశాలు, రేఖాంశాలతో సహా తేల్చింది. ఈ వివరాల్ని ప్రాథమిక అభియోగపత్రంలో పొందు పరిచింది. మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరులు ప్రతినెలా 50 నుంచి 60కోట్ల రూపాయలు వసూలు చేసి ఎంపీ మిథున్ రెడ్డి,విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలకు అందజేసే వారని, వారు ఈ డబ్బులను అప్పటి సీఎం జగన్ కు చేర్చేవారని సిట్ అభియోగపత్రంలో వెల్లడించింది. అందులో భాగంగానే మిథున్‌రెడ్డి, గోవిందప్పబాలాజీ, విజయ సాయిరెడ్డిలు రాజ్‌కెసిరెడ్డితోనూ, ఆయన నిర్వహించే ముడుపులవసూళ్ల నెట్‌వర్క్ సభ్యులతోనూ భేటీ అవుతుండేవారని సిట్ ప్రాథమిక చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసినట్లు సమాచారం.

# 'అన్నవరా'నికి గ్రహణం?

>> పౌష్టి కాహారం, మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో గల కిర్లంపూడి సత్రంలో ఈ నెల 25తేదీ నుండి మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో నవకోటి దత్త యాగం నిర్వహిస్తున్నారు. ఈ యాగంలో వేద విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆహారం అక్కడే తీసుకొని తిరిగి పాఠశాలలోనే బస చేస్తున్నారు. బుధవారం వారు తీసుకున్న ఆహారంలో మిరియాల చారు వికటించడంతో 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. గత ఏడాది జులై నెలలో వేద పాఠశాల చుట్టూ గడ్డి మొలవకుండా గడ్డి మందు పిచికారీ చేసినప్పుడు ఆ వాసనకు కొందరు వేద విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన అప్పట్లో సంచలనమైంది.

**కోలుకుంటున్న వేద విద్యార్థులు: దేవాదాయ కమిషనర్, చైర్మన్, ఈఓ పరామర్శ:** తుని ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుచున్న వేధ విద్యార్థుల ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు డిఎం అండ్ హెచ్వో జె. నరసింహ నాయక్ తెలియజేసారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ శుక్రవారం తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న వేధ విద్యార్థులను పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీసారు. మెరుగైన వైద్య సేవలు అందజేయాలని డాక్టర్లకు సూచించారు.అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రు లను ఓదార్చి ధైర్యం చెప్పారు. విద్యార్థులకు అందజేసే ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈఓకు సూచించారు. అనంతరం సత్యగిరి పైగల వేద పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుచున్న సదుపాయాలు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఈఓ వీర్ల సుబ్బారావు,ఆర్జేసి త్రినాధరావు తదితర అధికారులు ఉన్నారు.

**చైర్మన్ పరామర్శ:** దేవస్థానం చైర్మన్ రాజా ఐవి రోహిత్ శుక్రవారం తుని ఏరియా ఆసుపత్రి లో ఉన్న వేద విద్యార్థులను పరామర్శించి విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.అన్నవరం దేవస్థానంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటం తోనే రోజుకో సమస్య బయటపడి గ్రహణం పట్టినట్లు తయారవుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రధానంగా ఈవో పాలన పర్యవేక్షణ కొరవడటం వల్లనే ఈవిధంగా తయారయ్యిందని గతంలో ఎన్నడూ ఆలయంలో అప్రతిష్టకు గురైన సంఘటనలు పెద్దగా కనిపించడంలేదని కానీ ప్రస్తుతం గత రెండు నెలలుగా రోజు కో సమస్య అన్నట్లుగా బయటపడుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానంలో జరిగిన సంఘటనలపై స్థానిక ప్రజాప్రతినిధి,జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా అధికారులు స్పందించక పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

# కుట్రలు తిప్పికొట్టాలి

### ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 1,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రజలకు మంచి చేసేలా పాలన అందించాల్సిన బాధ్యత మాది.. దాన్ని సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ యంత్రాంగానిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంత్రులు, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ అధ్యక్షులు, జోనల్ కోఆర్డినేటర్లు, రైతుసంఘం నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్సులో రేపు ప్రారంభించనున్న అన్నదాత సుఖీభవ పథకంతో పాటు సుపరిపాలనలో తొలిఅడుగు వంటి అంశాలపై పార్టీ యంత్రాంగానికి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. సింగపూర్ పర్యటన విశేషాలను వివరించారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.."చెప్పిన విధంగా హామీలు అమలు చేస్తున్నాం. శనివారం నుంచి అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకం అమలు చేస్తునామన్నారు.

## బనకచర్లను అడ్డుకొని తీరుతాం

### కేంద్రం సపోర్టు ఉన్నదనే లోకేష్ మాటలు: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు1:**కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును కట్టి తీరుతామని లోకేశ్ మాట్లాడుతుంటే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి అని ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందువల్ల వారు మాట్లాడటం లేదని ఆయన ఆరోపించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవట్లేదని పేర్కొన్నారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామన్నారు. గోదావరి-బనకచర్ల అజెండాలో ఉంటే తాము ఉమ్మడి రాష్ట్రాల సమావేశానికి రాబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్రానికి లేఖ రాస్తే, ముఖ్యమంత్రి, అధికారులు మాత్రం ఇటీవల హాజరయ్యారని గుర్తుచేశారు. రాత్రికి రాత్రి ఢిల్లీకి వెళ్లి... మొదటి అంశమే బనకచర్ల ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొని, కమిటీ వేయడానికి అంగీకరించారని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ధైర్యం చూసుకొని లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బనకచర్లపై ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ మోనం కారణంగానే చంద్రబాబు బనకచర్లపై బుల్డోజింగ్ విధానంతో వెళుతున్నారని విమర్శించారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుంటే, అసలు బనకచర్ల కడితే కదా అడ్డుకునేది అని రేవంత్ రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకునే పనిలో ఉన్నట్లుగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. బనకచర్లపై లోకేశ్ బరితెగించి మాట్లాడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి గురు దక్షిణ చెల్లించే పనిలో ఉండగా, ఢిల్లీలో పీఠాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ మౌనంగా ఉంటోందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏపీ అడ్డుకోలేదని లోకేశ్ అంటున్నారు. కానీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు చంద్రబాబు 7సార్లు లేఖలు రాశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లు పెడతామంటే చూస్తూ ఊరుకోమన్నారు.

## 70 దేశాలకు సుంకాలు పెంచిన ట్రంప్

### పాకిస్థాన్‌కు తగ్గింపు!

**వాషింగ్టన్, ఆగస్టు 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను పెంచారు. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను విధించే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఇందులో సిరియాపై అత్యధికంగా 41 శాం టారిఫ్‌ను విధించారు. కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40 శాతం జత చేశారు. ఇక, భారత్‌పై 25 శాతం టారిఫ్ విధించారు. అయితే, పాకిస్థాన్ దిగుమతులపై 29 శాతంగా ఉన్న టారిఫ్‌లను 19 శాతానికి తగ్గించడం గమనార్హం. ఇక జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతంసుంకం ఉంటుందని ట్రంప్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టు 1 వరకు ట్రంప్ గడువు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన సుంకాలను సవరించారు. ఈ సవరించిన టారిఫ్‌లు ఏడు రోజుల్లో అమల్లోకి రానున్నాయి.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 182 పేజీలు: 10+4 వెల: 6.50



పోలీసు కానిస్టేబుళ్ల ఫలితాలు విడుదల

సప్తగిరుల్లో పచ్చదనం పెంపుపై దృష్టి 5లో




ఉత్తమ నటులు: షారుఖ్ ఖాన్ (జవాన్)



ఉత్తమ నటుడు: విక్రాంత్ మస్సే (12 ఫెయిల్)



ఉత్తమ నటి : రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)



ఉత్తమ దర్శకుడు: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)

## ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి

### 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

### టాలీవుడ్‌కు 7 జాతీయ అవార్డులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** కేంద్ర ప్రభుత్వం 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా 12త్‌ఫెయిల్‌ను ఎంపికచేసింది. జాతీయ ఉత్తమనటుడి అవార్డుకుగాను ఇద్దరికి ప్రకటించింది. షారూక్‌ఖాన్‌కు జవాన్ చిత్రానికిగాను లభించింది. అలాగే 12త్ ఫెయిల్ చిత్రంలో హీరో విక్రాంత మస్సేకు



ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి



ఉత్తమ యాక్షన్ స్టంట్ కొరియోగ్రఫీ: హనుమాన్

ఉత్తమ నటుడి అవార్డులు వరించాయి. ఉత్తమనటిగా హిందీచిత్రం మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వేలో నటించిన రాణిముఖర్జి ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగుచిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్‌కేసరికి అవార్డు వరించింది. ఉత్తమ యాక్షన్ స్టంట్ కొరియో >>2



ఉత్తమ బాలనటి: సుకృతి వేణి (గాంధీతాత చెట్టు)



మారిన శ్రీవాణి టికెట్ల జారీ

## ఇక ఎప్పటికప్పుడే గోవిందుని దర్శనం

**తిరుమల,ఆగస్టు 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఆలయం లోపల మరింత దగ్గరగా (కులశేఖరపడి-మొదటిద్వారం వద్దనుండి)దర్శనం చేసుకునే సదుపాయం శ్రీవాణి బ్రేక్‌దర్శనాల టిక్కెట్ భక్తులకు కల్పిస్తోంది. 10,500 రూపా యలు చెల్లించి అందుకున్న ఈ టిక్కెట్లతో ఏరోజుకారోజే భక్తులకు >>2



## సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

### షెడ్యూలు విడుదల చేసిన ఇసి

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 9నఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్, కౌంటింగ్ నిర్వ హించనున్నట్లు పేర్కొంది. ఈమేరకు వచ్చే నెల 9న ఉదయం 10నుంచి సాయం త్రం 5 వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపింది. ఇందుకోసం ఆగస్టు 7న ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు >>2

# 2029కి స్టీల్‌ప్లాంట్ పూర్తి

### సీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

### 15 నుండి మహిళలకు ఉచిత బస్సు

### కొత్తగా 1.09 లక్షల స్పౌజ్ పింఛన్లు

### జమ్మలమడుగు ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు



శుక్రవారం గూడెంచెరువుగ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న సిఎం చంద్రబాబు

**కడప, ఆగస్టు1, ప్రభాతవార్త బ్యూరో:** వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. శుక్రవారం జమ్మలమడుగు మండలం గూడెంచెరువులో పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం గతంలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారని, సీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఇతర ప్రాంతాలవారు ఇక్కడకికి వచ్చేవిధంగా చేస్తామని హామీ ఇచ్చారు. గత మహానాడులో ప్రకటించిన విధంగా స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పనులు జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో మొదలుపెట్టామని, 2029 నాటికి పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మొదటి విడతలో రూ.450 కోట్లు, రెండవ విడతలో 11850 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా కొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. సీమలో ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నప్పటికి జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయని తెలిపారు. గండికోట ప్రపంచంలోనే సుందరమైన ప్రాంతమని, రూ.80కోట్లతో పనులు ప్రారంభించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, ఒంటిమిట్ట, పెద్దదర్గా, గండికోట కారిడార్ ఏర్పాటు చేసి పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామని సిఎం స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆలోచన విధానంతోనే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం కలిగిందన్నారు. హెచ్ఎంఎస్ఎస్, జిఎన్ఎస్ఎస్, ఎస్ఆర్‌బిసి, తెలుగుగంగ ప్రాజెక్టులను తెలుగుదేశం పార్టీ హయాంలోనే చేపట్టామని తెలిపారు. సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆటోమొబైల్, స్పేస్, డిఫెన్స్, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, గ్రీన్‌ఎనర్జీ ప్రాజెక్టులను ఈ ప్రాంతంలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. రూ.3800 కోట్లతో 3900 క్యూసెక్కుల నీటిని హంద్రీనావా కాలువలకు అందిస్తామని చెప్పారు.2014-19 మధ్య కాలంలో నీటి పారుదల రంగానికి రూ.12200 ఖర్చు చేశామన్నారు. శ్రీశైలం దగ్గర నుండి సముద్రంలోకి వెళ్లే నీటిని వినియోగించుకుంటే ఏపి,తెలంగాణకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గోదావరినది ద్వారాఏడాదికి 2000 టిఎంసిల నీరు సముద్రంలోకి వృధాగా పోతుందని, వీటిని వినియోగంలోకి తీసుకొస్తే ఉభయరాష్ట్రాలకు ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అంతేగాక రాయల >>2

### 3 కీలక జాతీయ రహదారులు అనుసంధానం

## రూ.600కోట్లు కేటాయింపునకు కేంద్రం అంగీకారం

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కీలకమైన మూడు హైవేలను కలుపుతూ మరో గ్రీన్‌ఫీల్డ్ రహదారి రూ.600కోట్లతో అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకారం తెలిపారు.దీంతో దశాబ్దాలుగా కృష్ణాజిల్లాలో అత్యంత కీలక రహదారులకు మోక్షం లభించనున్నది.,కంకిపాడు నుంచి గుడివాడ మధ్యలో 27 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనులు పట్టాలెక్కబోతున్నాయి. ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద 600కోట్ల రూపాయలతో నిధులను ఈ రహదారి కోసం మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకారం తెలిపారు. విజయవాడ నుంచి గుడివాడకు చేరుకునేందుకు అత్యంత కీలకమైన ఈ రోడ్డు ప్రాధాన్యం >>2

# ప్రజాప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు

### మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని వెనకేసుకొస్తున్న జగన్: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించడం చేతకాక, ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి, ఆనాటి ప్రతిపక్ష పార్టీ నేతలను, సామాన్య ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసి, 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓటమి చెందటం వలన ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డికి మతి భ్రమించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు.ఆ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒకప్రకటన విడుదల చేసారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో రాష్ట్ర ప్రజలకు అందిస్తూ ఉంటుంటే అది చూసి ఓర్వలేక, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వంపై జగన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మంత్రి అచ్చెన్న మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను లూటీ చేసి, వేల కోట్లు దోచుకున్న జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన అసలైన రూపాన్ని మరోసారి బయటపెట్టారని అన్నారు. రాష్ట్ర మంత్రుల ఇళ్లపై దాడులు చేయండి అనే పిలుపు ఇచ్చిన జగన్ హత్యా రాజకీయాలకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో జరిగిన విపరీతమైన అవినీతిని ప్రజలు మర్చిపోలేరని, ప్రభుత్వ శాఖలన్నింటినీ తన దొంగ రాజకీయాలకు వాడుకున్న జగన్ రెడ్డి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకునే దిశగా రాజకీయ అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నాడని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలను వెనక్కి తొక్కి, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, ఉద్యోగాలు, అభివృద్ధిని మట్టికరిపించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికీ గుర్తుండిపోయే దాడుల రాజకీయాలను జగన్ రెడ్డి ప్రోత్సహించాడని,అందుకే ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసారని అన్నారు. గతంలో విశాఖ స్టీల్ ఫ్యాక్టరీను కాపాడిన కార్యకర్తలపై దాడులు చేయించి, హిందూపురం, మంగళగిరి, భీమవరం తదితర చోట్ల ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయించిన గుండా జగన్ రెడ్డి అని మండిపడ్డారు. మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ప్రజల స్వేచ్ఛను అణచివేతకు గురిచేసిన సంగతి ప్రతిఒక్కరికి గుర్తు ఉన్నాయని, ఇప్పుడూ అదే ముద్రతో తిరిగి దాడుల రాజకీయాన్ని తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్ రెడ్డికి, ఆయన పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారు. కూటమిని గెలిపించి, అభివృద్ధికి, సంక్షేమానికి ఓటు వేశారు. అయినా తన పరాజయాన్ని జీర్ణించుకోలేని జగన్, ఇప్పుడు అశాంతిని రెచ్చగొట్టే కుట్రలు చేస్తుండటం దురదృష్టకరం. జగన్మోహన్ రెడ్డి తన వ్యవహార శైలిని మార్చుకోకపోతే ప్రజలు ఓట్లు కాదు కదా కనీసం రోడ్లమీద కూడా తిరగనివ్వరని పరిస్థితి తలెత్తుతుందన్నారు. అవినీతి పరులను, దొంగలను, బెట్టింగ్ ఆడే వారిని, సంస్కారం లేని వ్యక్తులను వెనకేసుకొచ్చే జగన్మోహన్ రెడ్డికి ముఖ్యంత్రి చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హతలేదన్నారు. ఒక మహిళ శాసనసభ్యురాలని అసభ్యకరంగా మాట్లాడి, వ్యక్తిగతంగా దూషించిన ప్రసన్నకుమార్ రెడ్డిని, అవినీతి చేసి జైలు లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించడానికి జగన్మోహన్ రెడ్డి రావడం విడ్డూరంగా ఉందన్నారు. తన కారు కింద పడి మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ అయిన గంజాయిముఠా నాయకులను, రౌడీషీటర్‌లను, మదమెక్కిస్త్రీలను అగౌరవంగా మాట్లాడుతున్న సంస్కారంలేని నాయకులను పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. టీ దుకాణాలు మొదలు మల్టీ నేషనల్ కంపెనీల నుంచి వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కలెక్షన్లు వసూలు చేశారని ఇవ్వని కంపెనీలను బెదిరించి రాష్ట్రం వదిలి వెళ్ళే విధంగా చేశారని వారి అవినీతిలో జగన్మోహన్ రెడ్డికి కూడా వాటా వెళ్లిందని ఆరోపించారు.



## అన్నదాతా సుఖీభవ పథకానికి నిధులు జమ

### 46.85లక్షల మంది రైతులకు లబ్ధి

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** పీఎం కిసాన్‌అన్నదాతా సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2వ తేదీన అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది. ప్రకాశంజిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో సీఎం చంద్రబాబు నాయుడు ఈస్కీమ్‌ని ప్రారంభిస్తారు. రాష్ట్రంలోని 46లక్షల 85వేల 838 మంది రైతులు ఈ స్కీమ్‌ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్రవాటాగా ఒక్కో రైతుకు రూ. 5,000చొప్పున మొత్తం 2,342.92కోట్ల రూపాయలు రైతులఖాతాల్లో ప్రభుత్వం నేరుగా జమచేయనుంది. అర్హులైన రైతులందరికీ అన్నదాతా సుఖీభవ అందాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో ఆగస్టు 2వ తేదీన గ్రామ సచివాలయం నుంచి పంచాయతీలు,మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలస్థాయిలో కార్యక్రమం పండుగ వాతావరణం ఉండనుంది. అన్నదాతా సుఖీభవ అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒకరోజు ముందే మనమిత్రద్వారా సందేశాలు వస్తాయి. ఇప్పటికే రైతుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుంది. వెబ్‌ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబర్ తప్పుగా ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలి. జాబితాలో రైతుపేరు లేకపోయినట్లయితే వ్యవసాయ కేంద్రాల్లో సహాయకులను సంప్రదించాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని 46లక్షల 85వేల 838 మంది రైతులు పీఎం కిసాన్‌అన్నదాతా సుఖీభవ పథకాన్ని ద్వారా లబ్ధిపొందనున్నారు. ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.7,000జమ,దీనికితోడుగా కేంద్ర ప్రభుత్వం పీఎంకిసాన్ పథకంకింద మొదటి విడతగా రూ.2,000 చొప్పున >>2



శుక్రవారం నూతన ఎక్సైజ్ పాలసీపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## కొత్త ఎక్సైజ్ విధానంపై చర్చలు

### 31తో ముగుస్తున్న ప్రస్తుత పాలసీ గడువు

**విజయవాడ, ఆగస్టు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత బార్‌పాలసీ గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో, నూతన ఎక్సైజ్ విధానంపై మంత్రుల బృందం శుక్రవారం ఒక కీలక సమావేశం నిర్వహించింది. మంగళగిరి ఎక్సైజ్ కమీషనర్ కార్యాలయం నుంచి హైబ్రిడ్ మోడ్‌లో జరిగిన ఈ సమావేశంలో రాబోయే కొత్తబార్ పాలసీ రూపకల్పన పై లోతైన చర్చ జరిగింది. సమావేశానికి ఎక్సైజ్, ఖనిజ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సెర్ప్ మరియు ఎన్‌ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆరోగ్య, >>2

## 'అన్నవరా'నికి గ్రహణం?

### వేద విద్యార్థులకు అస్వస్థత రెండోసారి

### కొరవడిన అధికారుల పర్యవేక్షణ

### దేవస్థానం సమస్యలపై స్పందించని 'పెద్దలు'



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,ఆగస్టు 1 ప్రభాతవార్త:**అన్నవరం శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తుంటే దేవస్థానానికి గ్రహణం పట్టిందా అన్నట్లు ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శానిటరీ కాంట్రాక్టర్ నకిలీ చలాన్లతో మోసగించి దేవస్థానానికి అపకీర్తి తేవడం,టోల్ గేటు కాంట్రాక్టర్ నుండి జిఎస్టీతో పాటు లక్షలాది రూపాయలు లీజు సొమ్మువసూలు చేయకుండా తాత్సరం చేయడం, ఈఓకు, సిబ్బందికి నడుమ సమన్వయం కొరవడటం,కొందరు సిబ్బంది నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం చూస్తుంటే ఈపరిణామాలు దేనికి దారితీస్తాయోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానంలో స్మార్త ఆగమపాఠశాల విద్యార్థులపై అధికారులకు శ్రద్ధకొరవడిందని విమర్శలు వస్తున్నాయి. వారు తీసుకునే >>2

## లిక్కర్‌స్కాం నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ హయాంలో లిక్కర్ స్కాం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మంది నిందితులను అరెస్టు చేశారు. అంతకుముందు నిందితుల రిమాండ్ నేటితో ముగియడంతో విజయవాడ జిల్లా జైలు నుంచి తొమ్మిది మందిని కోర్టులో హాజరుపరిచేందుకు సిట్ అధికారులు జిల్లా జైలు నుంచి కోర్టుకు తీసుకు వెళ్లారు. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, పైలా దిలీప్, వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి నిందితులుగా ఉన్నారు. విజయవాడ జిల్లా జైలు నుంచి తొమ్మిది మంది నిందితులు, గుంటూరు జిల్లా జైలు నుంచి ఇద్దరు, రాజమండ్రి జైలు నుంచి మిథున్ రెడ్డిని కోర్టులో హాజరు పరిచేందుకు అధికారులు తీసుకువెళ్లారు. కోర్టు వీరి రిమాండ్‌ను పొడిగించింది.ఈ కేసు లోని నిందితులు, ముడుపులు వసూలు చేసే ముఠా సభ్యులతో ఎప్పటికప్పుడు భేటీ అయ్యేవారని సిట్ నిగ్గు తేల్చింది. జగన్ సన్నిహితుల్లో మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీ, సీఎంవో మాజీ కార్యదర్శి కె. ధనుంజయరెడ్డి, ఓఎస్డీ పి. కృష్ణమోహన్‌రెడ్డిలు ఉన్నారు. వీరంతా తరచూ సమావేశమయ్యేవారని టెక్నికల్,సైంటిఫిక్ ఆధారాలతో సిట్ నిర్ధారించింది. ఏయేతేదీల్లో, ఎవరెవరు >>2



## ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి

**విజయవాడ ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ ప్రకాశంబ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి 2,65,909 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ అన్నిగేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బాపట్ల జిల్లా రేపల్లే వరకు కృష్ణా తీరప్రాంత గ్రామాల్లోని పొలాల్లోకి నీరు ప్రవేశించింది. సాయంత్రానికి వరద ప్రవాహం కొంతమేరకు తగ్గుముఖం పట్టడం వల్ల అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సాగర్ 26క్రస్టు గేట్లను ఎత్తి 2,43,829క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ >>2

వార్త

ఒక్కొక్కప్పుడు మన సందేహాలే మనలను మోసం చేస్తాయి. సందేహం కలిగినప్పుడు భయం వల్ల మన ప్రయత్నాన్ని విరమిస్తాం. మనం సాధించగలిగే దాన్ని సైతం పోగొట్టుకుంటాం.

-ఫిలిప్స్

# పెరుగుతున్న వైట్‌కాలర్ నేరాలు

కుల,మత వర్గ, లింగ బేధాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా మనపెద్దలు రాజ్యాంగాన్ని, శాసనాలను రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేక దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాదిరూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. ప్రధానంగా వైట్‌కాలర్ నేరాలు అంతకంతకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. సమర్థవంతంగా దర్యాప్తు జరిపి పటిష్టరికార్డులు తయారు చేసి తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందుపెట్టి నేరాన్ని రుజువు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా, సకాలంలో ముందుకు నడవకపోతే, మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఎంతోకాలంగా వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అధికారులు సకలఅవస్థలు పడి కోర్టుల ముందు రుజువుకు సర్వంసిద్ధం చేసినప్పుడు కొందరు రాజకీయ నాయకులు మోకాలొడ్డుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తు న్నాయి. ఇలాంటి చర్యలతో సమర్థవంతంగా దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ పెరుగుతున్నది. దీంతోపాటు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలానుగుణంగా సవ రించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. తాజాగా కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, సవరణలుచేసి అమలు చేస్తున్నది. ఇంకా ఎన్నో మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆ విషయాన్ని అలా ఉంచితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏ మేరకు నిస్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేద తేడా లేకుండా ఎంతమేరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండాలేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రధానంగా దేశంలో బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవిత కాలంపాటు సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదన అరణ్యరోదనగా మారి కొందరు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే గత దశాబ్దకాలంలో దాదాపు ముప్పైఐదువేల కోట్ల రూపాయ లకుపైగా ఫైనాన్స్‌కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. రికవరీల మాట ఎలాఉన్నా నిందితుల్లో పదిశాతం మందిపై కూడా పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇరవైఐదు లక్షలు మొదలు ఐదువందల కోట్లవరకు మోసం చేసిన ఫైనాన్స్‌కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవడంలో నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలను కొట్టివేయలేం. దేశంలో నిత్యం ఏదోఒకచోట ఈ దగా జరుగుతూనే ఉన్నది. ఇక ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ల అమ్మకాలలో ఘరానా మోసం చేసిన పెద్దలెందరో నిర్భయంగా తిరు గుతున్నారు. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీపడి ప్రజలను మోసం చేసి కోటీశ్వర్లుఅవుతున్నారు. ఈ విష యంలో బాధితులు కొందరు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవాడివా? అంటూ సవాలక్ష ప్రశ్నలు సంధించి బాధితులు మళ్లీ పోలీసు స్టేషన్ మెట్లెక్కకుండా చేసి పంపుతున్నారు. అంతే కాదు మరికొన్ని సందర్భాల్లో ఇది సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీలు లేదని కోర్టుకు వెళ్లి కేసులు పెట్టి పరిష్కరించుకోమని సలహా ఇస్తున్నారు. ఒకవేళ ఏదైనా కారణాలతో కేసు నమోదు చేయాల్సివస్తే సాక్ష్యా ధారాలున్నాయా? లేవా? రికార్డు పరిశీలించి దర్యాప్తులో సంతృప్తి చెందితేనే నమోదు చేసి చర్యలు చేపడుతున్నా రు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసుల బాధ్యతలు కూడా పెరిగిపోయాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా విఐపిల బందో బస్తులో ఎక్కువ సమయం గడపాల్సి వస్తున్నది. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా, అరాచకశక్తులు విజృంభించడంతోపాటు శాంతిభద్రతలు క్షీణించినా పర్వా లేదు కానీ ఒక్క విఐపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు జరిగినా తమ ఉద్యోగానికి ముప్పు తప్పదన్న భావనతోనే ప్రజాసమస్యలు విస్మరించి నేతల సేవ వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఇలాంటి ఫిర్యా దులు నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఇక నిరుద్యోగులను మోసం చేసే దళారులు ఎక్కువైపోయారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనో, విదేశాలకు పంపిస్తామనో లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటూ పరారవుతున్న దగాకోరులు ఎక్కువవుతున్నారు. ఇలా ఒకటనికాదు. ఎక్కడ వీలైతే అక్కడ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా మోసపోయేది అధికశాతం మధ్యతరగతి ప్రజలే. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాల కులు ఈనేరాలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

దేశాభివృద్ధి అంటే ఎత్తయినఅద్దాల మేడలు నిర్మించడంకాదు. పౌరుని నైతికాభివృద్ధే అసలైన అభివృద్ధి.



మహాత్మా గాంధీ

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలు అన్వేషించాలి.



రాబర్ట్ ఆంథోనీ

# తిలాపాపం తలా పిడికెడు

*కల్తీ కల్లు విషయం ప్రత్యేకంగా నిఘా వేసి, దర్యాప్తు చేయాల్సిన పనిలేదు. ఆ ప్రాంతంలో చెట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత కల్లు వస్తుంది? ఎంత అమ్ముతున్నారు? అని పరిశీలిస్తే తెలుస్తుంది. అయినా పాలకులు కళ్లు మూసుకుంటున్నారు. ఫలితంగా ఎందరో నిరుపేదలను ఈ కల్తీ కబళిస్తున్నది. ఇదే సమయంలో కల్తీకల్లుతోపాటు స్వచ్ఛమైన కల్లును కూడా నిషేధించడం ఏమాత్రం సమంజసం కాదు. కల్లుగీత పరిశ్రమపై తెలుగు రాష్ట్రాల్లోనే లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒక్క కల్లు కల్తీయేకాదు మద్యం, పాలతోసహా ఉప్పు, పప్పు నూనె లాంటి నిత్యావసర సరుకుల్లో కల్తీని మట్టుపెట్టేందుకు పాలకులు త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేయాలి. అన్నింటి కంటె ముఖ్యంగా కల్తీవల్ల జరుగుతున్న అనర్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఈ బాధ్యతంతా ప్రభుత్వంపైనే పెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజాసంఘాలు అంతా నడుం బిగించాలి.*

దామెర్ల సాయిబాబ

మానవజాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాలను పారద్రోలే విషయంలో ఆరాటమే కానీ, త్రికరణ శుద్ధిగా పోరాటం చేయడం లేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలతో మాదకద్రవ్యాలు తోడు కావడంతో దేశంలో కోట్లాది కుటుంబాలు చితికిపోతున్నాయని, లక్షలాది మంది మంచానికే పరిమితమై కృంగికృశించి మరణిస్తున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు. ఇప్పుడు కల్తీకల్లు ఈ వ్యసనాలకు తోడైంది. ఈ కల్తీకల్లు కారణంగా కూడా అనేక మంది రోగాలబారిన పడి చిక్కి శల్యమై ఎందరో అసువులు బాస్తున్నారు. వాస్తవంగా చూస్తే స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందనే విషయం వైద్య నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. కానీ ఆ స్వచ్ఛమైన కల్లు స్థానంలో కల్తీకల్లు చేరుకొంటున్నది. సాగు విస్తరణ, నగరీకరణతో తాటి ఈత చెట్లు కనుమరుగు కావడంతో ఉత్పత్తి అయ్యే కల్లు తగ్గిపోతుండడంతో కల్తీ కల్లు పెరిగిపోతున్నది. అటు మద్యంలోనూ, కల్లులోనూ కల్తీ జరుగుతున్న విషయం పాలకులకు తెలియందికాదు. నియంత్రించేందుకు చట్టాలు చేస్తున్నారు, ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. కొందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయవచ్చు. అందరిని ఎల్లకాలం మోసం చేద్దామనుకుంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను దగా చేసి ఇబ్బందులపాలు చేసిన ఎందరో చక్రవర్తులు, రాజులు, ప్రజాస్వామ్యంలో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజా అవసరాలను గుర్తించి, ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ఆదరాభిమానాలు పొంది, వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నవారు చిరస్థాయిగా మిగిలిపోతారు. మాదకద్రవ్యాల విషయంలో అటు కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత మంది అధికారులను నియమిస్తున్నా నిందితులను పట్టుకొని జైళ్లలో పెడుతున్నా అది ఏమాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నది. యేటా దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల మత్తుపదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏమాత్రం తక్కువ లేదు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, గౌరవప్రదమైన ఉద్యోగాలు చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ మత్తుకు అలవాటు పడడమే కాదు అందులో కొందరు వ్యాపారం కూడా చేస్తున్నారు. ఈ వారంలో కూడా కోట్లాది రూపాయల మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. ఇక మద్యం విషయంలో పాలకులు పైకి ఏమిచెప్తున్నా ఆదాయం కోసం ప్రోత్సహిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. గతంలో దశలవారీగా తగ్గిస్తామని చెప్పుకున్న పెద్దలే అంచెలంచెలుగా పెంచుతున్నారు. ఒకనాడు కేవలం వందకోట్ల ఆదాయంతో ప్రారంభమైన మద్యం వ్యాపారం నేడు రెండు రాష్ట్రాల్లో కలిసి యాభై,అరవై వేల కోట్లకుపైగా చేరుకున్నది. తెలుగు రాష్ట్రాల్లో నాటుసారా, గుడంబా, అక్రమంగా తయారయ్యే చీప్ లిక్కరు అంతా కలిపి ఎనభైవేల కోట్లకు పైగా ఉంటుందని అనధికార అంచనా. ఇది లక్ష కోట్లకు చేరుకోవడానికి ఎంతో కాలం పట్టకపోవచ్చు. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా పరిణమించింది. ఇక మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏమాత్రం అమలవుతున్నది? మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉండొచ్చు. కానీ సారా దొరకని గ్రామం లేదు. గుడంబ, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. ఈ అక్రమ సారాను నియంత్రించేందుకు పాలకులే చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజారోగ్యానికి అత్యంత హాని చేస్తున్నది

ఒక్క మాట

ఈ చీప్ లిక్కరే. ముఖ్యంగా పేదల జీవితాలు ఈ చీప్ లిక్కర్‌తో చితికిపోతున్నాయి. లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ధూమపానాన్ని నియంత్రించే విషయంలో కూడా పాలకులు విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండెజబ్బులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందువని ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో వెల్లడయింది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు అలవాటుపడ్డారు. ఇందులో బీడీలు తాగేవారే అధికంగా ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారుతున్నది. ఇటీవల కాలంలో పదమూడు, పద్నాలుగేళ్ల వయస్సులోనే ఆరంభం కావడం ఆందోళన కలిగించే అంశం. కేవలం ధూమపానం వల్లనే దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేక రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిదివందలకుపైగా ప్రమాదకర విషవాయువులు ఉన్నాయి, ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయి. అయితే మరోకపక్క బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం వివేకం అనిపించుకోదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే జీవనోపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను,వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒక పరిష్కారం లభిస్తుంది. ఇక కల్తీ కల్లు కూడా ప్రజారోగ్యాన్ని కాటు వేస్తున్నది. గత నెలలో తెలంగాణలో కల్తీకల్లుకు తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇరవైమంది వరకు ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకొని బయటపడ్డారు. అటు చీఫ్ లిక్కర్‌తో కానీ కల్తీ కల్లుకు బలైపోతున్నవారిలో అధికశాతం రెక్కాడితే డొక్కాడని నిరుపేదలే. నీళ్లలో తెల్లగా నురుగు వచ్చేలా రసాయినికాన్ని కలిపి కల్లులా కనపడేలా తయారు చేసి మత్తు కోసం డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి మత్తుపదార్థాలను కలుపుతున్నారు. ఇది సహజ సిద్ధమైన చెట్లనుండి వచ్చే కల్లు కాదని తెలిసినా కల్లుకు అలవాటు పడినవారు సేవిస్తున్నారు.పరిస్థితి ఎలా వచ్చిందంటే ఇదే అసలుసిసలైన కల్లుగా భావించి సేవించేవారు ఎక్కువైపోతున్నారు. ఈ కల్తీ కల్లు తాగకపోతే జీవించలేని పరిస్థితుల్లో కొందరు కొట్టుమిట్లాడుతున్నారు. కరోనా సమయంలో ఈవిషయం బయట పడింది. కల్తీకల్లు దొరకక ఆసుపత్రుల పాలైనవారెందరో ఉన్నారు. ఎలాంటి చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో డాక్టర్ల సలహాలతోనే కల్తీకల్లు తాగిస్తేనే మామూలు మనుషులయ్యారు. కల్తీకల్లు గూర్చి పాలకులకు తెలియంది ఏమి లేదు. చట్టాలెన్నో ఉన్నాయి. అయినా చర్యలు తీసుకోరు. వారికున్న కారణాలు వారికి ఉన్నాయి. సహజ సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుండి వస్తున్న స్వచ్ఛమైన కల్లును డాక్టర్లుతోసహా ఎవరు వ్యతిరేకించడం లేదు. గతంలో తాచు పాముల్లా ఉండే ఎక్సైజ్ అధికారులంటే భయభక్తులుండేవి. కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా వారు కూడా తమ చిన్నిపొట్టకు శ్రీరామరక్ష అన్నట్లు వానపాముల్లా మారి కాలక్షేపం చేస్తున్నారు. దీంతో అటు మద్యంలోనూ, ఇటు కల్లులోనూ కల్తీ విజృంభించిపోతున్నది. కల్తీ కల్లు విషయం ప్రత్యేకంగా నిఘా వేసి దర్యాప్తు చేయాల్సిన పనిలేదు. ఆ ప్రాంతంలో చెట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత కల్లు వస్తుంది? ఎంత అమ్ముతున్నారు? అని పరిశీలిస్తే తెలుస్తుంది. అయినా పాలకులు కళ్లు మూసుకుంటున్నారు. ఫలితంగా ఎందరో నిరుపేదలను ఈ కల్తీ కబళిస్తున్నది. ఇదే సమయంలో కల్తీ కల్లుతోపాటు స్వచ్ఛమైన కల్లును కూడా నిషేధించడం ఏమాత్రం సమంజసంకాదు. కల్లుగీత పరిశ్రమపై తెలుగు రాష్ట్రాల్లోనే లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైఉంది. ఒక్క కల్లు కల్తీయేకాదు మద్యం,పాలతోసహాఉప్పు, పప్పు నూనె లాంటి నిత్యావసర సరుకుల్లో కల్తీని మట్టుపెట్టేందుకు పాలకులు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయాలి. అన్నింటికంటె ముఖ్యంగా కల్తీవల్ల జరుగుతున్న అనర్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఈ బాధ్యతంతా ప్రభుత్వంపైనే పెట్టకుండా స్వచ్ఛందసంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజాసంఘాలు అంతా నడుం బిగించాలి. ●

# 'అమృత్ కాలా'నికి అమెరికా నుంచి అపశకునాలు!

డా.డి.వి.జి. శంకరరావు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ వాణిజ్యంపై విరుచుకుపడ్డాడు. భారత్ నుండి తమకు వస్తున్న దిగుమతులపై ఇరవై ఐదు శాతం పన్ను విధించడంతోబాటు అదనంగా పెనాల్టీ కూడా వేస్తానంటున్నాడు. అది కూడా తక్షణమే అమలులోకి తీసుకు వచ్చాడు. భారత్ తాను అమెరికా ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా రష్యా, ఇరాన్‌లతో వాణిజ్య సంబంధాలు కొనసాగించడం ఈ నిర్ణయాలకు కారణాలుగా చెప్తున్నా, అంతకు మించిన కడుపు మంట, కంటగింపు నేపథ్యంగా ఉన్నట్టున్నాయి. అందుకనే పన్నులు పెంచడంతో బాటు మన దేశపు ఆర్థిక వ్యవస్థని ప్రాణం లేనిదిగా అభివర్ణించాడు. ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్న పెద్ద ఆర్థికవ్యవస్థ, జీడీపీ వృద్ధిఆరు శాతం పైగా కొనసాగుతున్న వేళ అలా అభివర్ణించడం పిచ్చితనమే. వీటి వెనుక అసలు కారణం భారత్ తన దేశ ప్రయోజనాల కోణంలో స్వతంత్రంగా వ్యవహరించడమే. అమెరికా కోరుకున్నట్లు వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులకు సుంకాలు తగ్గిస్తే,అవి వెల్లువెత్తి మన దేశవాళీ పంటలు, పాలు నష్టపోతాయి.రక్షణ కొరవడుతుంది. అక్కడ ఆ దేశం వాటికి భారీ రాయితీలు సమకూర్చి ప్రోత్సహించడం వల్ల, అంత చౌకగా ఇక్కడ రైతు పోటీకి నిలువలేడు. ఒకసారి వాడు మార్కెట్ ఆక్రమించుకున్నాక, మోనోపలీ సాధించి తర్వాత తనప్రతాపం చూపిస్తాడు.అప్పటికి ఇక్కడి స్వయం సమృద్ధి ధ్వంసం అవుతుంది.అందుకనే ఈ విషయంలో బేరసారాలకు తావులేదు.రష్యా నుండి ఆయుధాలు,ఇంధనం కొనుగోలు చెయ్యడం. అది భారత్ ఇష్టం.పైగా ఒకప్పటి కన్నా ఇప్పుడు ఆదేశం నుండి కొనుగోళ్లు కూడా తగ్గాయి. పోనీ అమెరికా చెప్పినట్టు మన లాభం వదులుకొని అమెరికాతోనే అంటకాగితే ఫలితం ఏమైనా ఉందా? అమెరికాలో భారతీయుల ఉద్యోగాలతో సహా అన్నింట్లో కోత.పక్కన శత్రువుగా తయారైన పాకిస్థాన్‌ని పెంచి పోషించడం,దాని భారత వ్యతిరేక విధానాన్ని సమర్థించడం. ఏదేమైనా అమెరికా సుంకాలు,ఆంక్షలు భారత్‌ని కలవరపెట్టరాదు. మరింత బలం పొందడానికి, ప్రపంచ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోడానికి కారణం కావాలి. ఈ మధ్య బ్రిటన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రీతిలోమిగతా దేశాలతో ప్రయత్నించాలి. దేశంలోని వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వతంత్ర భారతానికి అమృత కాలం అని భావిస్తున్న 2047లోగా అభివృద్ధి యాత్రలో, రాగల అడ్డంకుల్ని ఊహించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.ముఖ్యంగా అమెరికాతో వాణిజ్యంలో సమాన స్థాయిలో బేరసారాలు సాగించాలి. బెదిరింపులకు, వడ్డింపులకు సై అంటే సై అనాలి.ఎందుకంటే ట్రంప్ దంతా మేకపోతు గాంభీర్యమే. చైనాని ఇలానే బెదిరించి వెనక్కు తగ్గలేదా! ●

# మహిళలకు వెలుగు దారి చూపే 'ఉచిత బస్సు'



వాసంశెట్టి సుభాష్

ఆడపడుచులకు ఆయనే పెద్దన్న..మహిళలు కన్న స్వప్నాలను నిజం చేస్తున్న కుటుంబ పెద్ద. వనితలకు చేయి అందించితోడుగా నిలిచే బంధువు ఆయన. నిన్నటి కష్టాలు మరచిపోయి చిరునవ్వులతో హాయిగా తమ కాళ్ల మీద తాము నిలబడేటట్టు చేయాలనే తపన పడే నాయకుడు. ఆయనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఉచితబస్ ప్రయాణం హామీ అమలు దిశగా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళా సాధికారతకు మార్గమన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. నాలుగు గోడల మధ్య ఇంటికే బందీ అయిన మహిళలకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే స్వేచ్ఛఉచిత ఆర్టీసీ బస్సు వల్ల లభించనుంది.గ్రామీణ, పేద, మధ్య తరగతి మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదు. బాల్యంలో తండ్రి, పెళ్లి అయ్యాక భర్త, వృద్ధాప్యంలో కన్న బిడ్డలపై ఆధారపడి ఉండాలి. ఏ అవసరానికి ఎక్కడికి వెళ్లాలన్నా, ముందే మొరపెట్టుకోవాల్సిందే. ఆర్థిక పరిస్థితి అనుకూలించి అవసరమైన డబ్బులు ఉంటేనే మహిళలు ఇంట్లో నుంచి వెళ్లగలుగుతారు. ఈ బానిస బంధాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా బద్దలుకొట్టారు. ప్రయాణం చైతన్యానికి మొదటి మెట్టు. స్త్రీలు స్వేచ్ఛగా ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం వారి జీవితాల్లో అనేక ఆశలు రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచితబస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇంకా 50 శాతం ఆడవాళ్లు వంటింటికే పరిమితమై ఉన్నారు. బయట సమాజం గురించి అభివృద్ధి చెందుతున్న విజ్ఞానం గురించి, ప్రపంచంలో జరుగుతున్న సరికొత్త మార్పుల గురించి తెలియని మహిళలు నేడు జనాభాలో సగం మంది ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటు విజ్ఞాన విహారాన్ని కూడా మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం దరి చేరుస్తుంది. అడ్డకూలీలు, వ్యవసాయ కూలీలు, నిరుపేద మహిళలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు తమ సంపాదనలో ఎక్కువ శాతం ప్రయాణినికే ఖర్చు పెట్టేవారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రస్తుతం వీరికి ఉపశమనం కలిగిస్తుంది. మంచి కూలి దొరుకుతుందంటే దూరం పోవడానికి ఇక వెనుకాడరు. అదే విధంగా పేద మహిళలు ఉచిత బస్సుసౌకర్యంతో ఆర్థికంగా ఎంతో మేలు పొందుతారు. పేద,మధ్య తరగతి మహిళలకు ఉపాధి మార్గాలు తెరచే విధంగా చంద్రబాబు నాయుడు చేశారని చెప్పవచ్చు. ఉచిత బస్సు పథకం అమలు చేయాలనే కూటమి ప్రభుత్వం లక్ష్యం ప్రశంసనీయమైన చొరవే. ఎందుకంటే ఇది



మహిళల ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం కోసం దోహదపడుతుంది. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక చిక్కులు కలిగిస్తుంది. కాని ఆ చిక్కులను అధిగమించే దిశగా ఆలోచన చేయడమే చంద్రబాబు నాయుడు రాజకీయ చతురతకు అద్దం పడుతుంది.ఆర్టీసీకి భారం కాకుండా ఇతర మార్గాలను అన్వేషించే విధంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నందున చంద్రబాబు ధైర్యంగా ముందడుగు వేయగలిగారు. ఈ పథకం విధివిధానాలపై దాదాపు ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ప్రయాణ దూరం కేటాయింపు బస్సులపైన ఆర్టీసీ అధికారుల నుంచి ప్రభుత్వం వివరాలు సేకరించింది. జిల్లా పరిధిలో మాత్రమే మహిళలు ఉచితంగా ప్రయాణించేలా ఈ పథకం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో ప్రస్తుతం ఏ కేటగిరి బస్సులు ఎన్ని తిరుగుతున్నాయి,ఎంత మంది ప్రయాణం చేస్తున్నారనే వివరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగుతోపాటు విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో తిరిగే సిటీ ఆర్డినరి బస్సుల్లో 88శాతం ప్రయాణికులు ఉమ్మడి జిల్లాల పరిధిలోనే రాకపోకలు సాగిస్తున్నట్టు తేలింది. 12శాతం బస్సులు మాత్రమేపొరు గున ఉన్న జిల్లాలకు తిరుగుతున్నాయి.ఉమ్మడి జిల్లాల్లో ఈ లెక్కలు పరిశీలించిన తర్వాత ఉమ్మడి జిల్లా పరిధి ప్రాతిపదికగా ఈపథకం అమలు చేయాలనే నిర్ణయానికి కూటమి సర్కారు వచ్చినట్టు సమాచారం.ఆర్టీసీలో ప్రస్తుతం11,449 బస్సులున్నాయి.ఇందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీఆర్డినరీ బస్‌లు కలిపి 6,561ఉన్నాయి.ఇవన్నీ ఎక్కువ ఉమ్మడి జిల్లాల్లోనే రాకపోకలు సాగిస్తున్నాయి. 1,897 ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. ఈ లెక్కన పొరుగు జిల్లాలకు 8.5శాతం మంది మాత్రమే ప్రయాణిస్తున్నారు. కాగా 91.5శాతం ఉమ్మడి జిల్లాలోనే ప్రయాణిస్తున్నట్టు తేలడంతో ఉమ్మడి జిల్లాల పరిధిలోనే ఈపథకం అమలు కానుంది. అలాగే ఈ పథకం అమలు గ్రామీణ, సిటీ ఎక్స్‌ప్రెస్ బస్సులకు పరిమితం చేయనున్నారు. ఈ బస్సుల్లో రోజుకు 16.11లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈపథకం అమలు చేస్తే వారి సంఖ్య 26.95 లక్షలకు చేరుతుందని అంచనా. అంటే నిత్యం సగటున 10.84 లక్షల మంది ప్రయాణీకులు పెరుగుతారని భావిస్తున్నారు. విజయవాడ,విశాఖపట్నం తిరిగే సిటి బస్సుల్లో మాత్రం వారానికి 4 సార్లు రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా పరిధిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.242 కోట్లు భారం పడుతుందంటున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల నష్టపోయిన ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి భర్తీచేయాల్సి ఉంటుంది.కార్పొరేషన్ నిర్వహణ ఖర్చులలో ఇంధనం, నిర్వహణ సిబ్బంది జీతాలు ,ఇతర ఓవర్ హెడ్ ఖర్చులుంటాయి. ప్రయాణీకులు బస్సు ఛార్జీలు చెల్లించకపోయినా వీటిని భరించాలి.ఇప్పటికే ఆర్టీసీ ఆదాయ నష్టాలను కూడబెట్టుకుందనేది నిర్వివా దాంశం. రాష్ట్రంలోని అన్ని ప్రయాణికుల ప్రాంగణాల్లో కొత్త రూపులు దిద్దుకుంటున్నాయి. ఉచిత ప్రయాణంలో ప్రయాణికులు ఇబ్బందిపడకుండా ముందస్తు సన్నహాలు చేస్తున్నారు.ఆర్టీసీ బస్ ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. రద్దీ తరుణంలో పారిశుధ్యం, మరుగుదొడ్ల అవసరాలు, లైటింగ్, గాలిపంకాలు అదనంగా ఏర్పాటు, తాగునీటిసౌకర్యంపై దృష్టి పెట్టారు. వీటన్నింటిని ఆగస్టు 15కంటే ముందుగా అందుబాటులోకి తేనున్నారు.అదనపు సర్వీసులు తిప్పనున్న నేపథ్యంలో ఆ మేరకు డ్రైవర్లను, కండక్టర్లను సర్దుబాటు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రయాణించే మహిళలకు ఉచిత టికెట్ జారీచేస్తారు. వారిలో చైతన్యాన్ని పెంచుతుంది. ఆంధ్రప్రదేశ్ మహిళా లోకంలో కొత్త వెలుగు కనిపించబోతోంది. ●

(రచయిత: కార్మిక శాఖ మంత్రి)

## ప్రజావాక్కు



### కృత్రిమ మేధ ప్రభావం ముప్పు తప్పదా!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్నఒకప్పటి మాట.ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావంతో మారిపోతుంది. ఏరోజు ఉద్యోగం ఉంటుందో,ఏరోజు ఊడుతుందోతెలియని పరిస్థితి నెలకొంది. ఈ మధ్యనే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి.సి.ఎస్) దేశ వ్యాప్తంగా 12వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నట్లుగా ప్రకటించింది. ఒక్కటి.సి.ఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్.సి.ఎల్, వంటి సంస్థలదీ ఇదే బాట. ఉద్యోగులను తొలగించడంలో ఒక దానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇటువంటి ప్రకటనలతో ఉద్యోగుల్లో కలకలం సృష్టిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం రోజురోజుకు పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్,టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. భారీ లాభాలు వస్తున్నప్పటికీ పలు సంస్థలు ఉద్యోగులపై వేటు చర్యలు చేపడుతున్నాయి. మనదేశంలో కొంత కాలంగా టెక్ రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ప్రాథమిక తరగతులకు వర్ణమాల

ప్రభుత్వం ప్రాథమిక తరగతులకు తెలుగు పాఠ్యాంశంగా వర్ణమాల కనీసం ఐదో తరగతి వరకు ముద్రించాలి. అలాగే తెలుగు హిందీ పాఠ్యాంశంగా ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి దాకా వర్ణమాల,గుణింతాలు పాఠ్యాంశంగా పెట్టడం మంచిది. ఎందుకంటే ఒకటి రెండు తరగతుల్లో విద్యార్థులు పూర్తిగా వర్ణమాల, గుణింతాలు నేర్చుకున్నా మరిచిపోయే అవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం తెలుగు హిందీ సబ్జెక్ట్‌లకు వర్ణమాల ముద్రించాలి.

- డి చాంద్ బాషా,కర్నూలు

### బదిలీల తర్వాత పదోన్నతులు ఇవ్వాలి

ఉపాధ్యాయుల పదోన్నతి షెడ్యూల్స్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. గతంలో పదోన్నతి పొంది వివిధ జిల్లాల్లో చేస్తున్న వారికి ఇబ్బందిగా ఉంది. ఎప్పుడైనా బదిలీల తర్వాత పదోన్నతి ఇస్తారు. ప్రస్తుతం కేవలం పదోన్నతులు ఇవ్వటం వల్ల జూనియర్ అయిన వారికి అనుకూలం అయిన పాఠశాలలు దొరుకుతాయి. వీనిని దృష్టిలో పెట్టుకొని ముందుగా బదిలీల ప్రక్రియ తర్వాత పదోన్నతులు ఇవ్వాలి. బదిలీలు కాకముందు ఇవ్వకూడదు.

-కామిడీ సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

### దూరమవుతున్న స్నేహ వాస్తం

పార్లమెంటులో అధిక సమయం ఆపరేషన్ సిందూర్ పై చర్చలు ప్రభుత్వ ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా జరిగాయి. ఫలితం ఏమొచ్చింది? కాలం వృధా అయింది. ప్రతి పక్షాలకు శాంతి లభించింది. పి.ఎమ్. నరేంద్ర మోడీ తన ధోరణితో కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసారు. హోమ్‌మంత్రి వర్యులు అమితషా మరొక మెట్టు ఎక్కి కాంగ్రెస్ కాశ్మీర్‌లోని పాకిస్థాన్ అన్యాయంగా ఆక్రమించిన స్థలాన్ని భారత్‌లో కలపలేక పోయిందనీ అన్నారు. ఆ పని మేము చేసి చూపిస్తాం అన్నారు. ఈ పదకొండేళ్ళ కాలంలో ఈ విలీనానికికాలం సరిపోలేదా? డబ్బైఐదేళ్ళ సుదీర్ఘ సర్వసత్తాక ప్రజాస్వామ్యంలో పాక్ నుండి మన భూభాగాన్ని తిరిగి సాధించుకోలేక పోయామంటే పాకిస్థాన్ యీ విషయంలో ఎంత బలమయిన దేశమో చెప్పకనే చెబుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మొక్కలు నాటాలి

దేశంలో పేదరికం కంటే ఆర్థిక అసమానతలు ప్రధాన సమస్య అనేది విదితమే. అయితే ఈఆర్థిక అసమానతలు పోగొట్టడానికి ఉపాధి హామీ ఏమైనా ప్రయత్నం గత రెండు దశాబ్దాలుగా చేసినదా అంటే అవునని సమాధానమే వస్తుంది. అది భూమి చదును కార్యక్రమాలవల్ల కావొచ్చు సరిహద్దు కంధకాల ద్వారా కావొచ్చు. అయితే ఉపాధి హామీని పండ్ల తోటల పెంపకంలో విశ్లేషణ చెయాలి. రైతులకు నష్టం జరగకుండా ఉండాలి అంటే అంతర పంటలు వేయాలి. అంటే గేట్ల వెంబడి చెట్లు నాటడం మాత్రమే సరైన చర్య అయితే ఎకరానికి 40 చెట్లు నాటడం ద్వారా రైతులు 3 ఏండ్ల పాటు ఉపాధిని నిరంతరాయంగా చేయగలుగుతారు.అంత మాత్రమే కాదు వాటికి వేసే ఎరువుల ద్వారా కూడా వారికి డబ్బులు వచ్చే అవకాశం ఉంది. కావున పండ్ల తోటలు తెలంగాణకు ఉపయుక్తంగా ఉండగలవు.

-భారత అవినాష్,జనగామ

### బస్సులకు ఫిట్ నెస్ తప్పనిసరి

పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. మంచి విద్యాసంస్థ ఎంపికతో పాటు తమ పిల్లల సుర క్షిత ప్రయాణం కోసం ప్రైవేట్ సంస్థల వ్యాన్లు, బస్సుల ఫిట్నెస్, అనుభవజ్ఞులైన డ్రైవర్లు,నిబంధనల మేరకు వాహనం ఉన్నదా లేదా కూడా తప్పక ఆరాతీయాలి. విద్యార్థులు కూర్చునేందుకుఅనువైనసీట్లు, ప్రథమ చికిత్స పెట్టె, పిల్లలు బస్సు ఎక్కే, దిగేసందర్భాల్లో బస్సు క్లీనర్ అందుబాటులో ఉండాలి.

-సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



## పెన్షన్ విధానంలో దేశానికే ఆదర్శం ఆంధ్రప్రదేశ్

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**శ్రీకాకుళం, ఆగస్టు 1, (ప్రభాతవార్త ప్రతినిధి) :** రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ పెన్షన్ విధానం అమలు చేస్తోందని జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం సుఖంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నెల నెలా పింఛన్లు అందిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం గొప్ప సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో నెలకు సుమారు రూ. 2,700 కోట్లు, సంవత్సరానికి రూ.33,000 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు.

## పరిశుభ్రమైన భారతావనే రైల్వే లక్ష్యం

### - రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఎం గుప్తా



**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 1,ప్రభాతవార్త** పరిశుభ్రమైన భారతావని సాధించడమే రైల్వే ప్రధాన లక్ష్యమని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వే డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛరైలు-స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం రాయలసీమ జిల్లాలతో పాటు గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ప్రారంభించామన్నారు. ముందుగా డిఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా రైల్వే సిబ్బందిచే స్వచ్ఛత అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఇఎన్‌హెచ్ఎం జితేంద్ర కుమార్, సీనియర్ డిఎంఇ(సిఅండ్ డబ్ల్యు) మణికుమార్ వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కోయిలకుంట్ల, ప్రొద్దుటూరులలో నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 1,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా నాందేడ్-ధర్మవరం-నాందేడ్ మధ్య తిరిగే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు శుక్రవారం నుంచి కోయిలకుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్/ హాల్టింగ్‌ను కల్పిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

# పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాలు విడుదల

### - ఫలితాలు ప్రకటించిన హోం మంత్రి అనిత

### - విశాఖపట్టణానికి చెందిన గండి నానాజీ 168 మార్కులతో ప్రథమ స్థానం



పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాలు ప్రకటిస్తున్న హోంమంత్రి అనిత

**విజయవాడ,ఆగస్టు1, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో 6100 కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రధాన కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్.కె. మీనా, అడిషనల్ డీజీపీ ఎన్. మధుసూదన రెడ్డి పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 3580 సివిల్ పోలీస్ కానిస్టేబుల్స్ (స్త్రీ, పురుషులు), 2520 ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (పురుషులు) నియామ కాలకై నిర్వహించిన పరీక్షల్లో విశాఖపట్టణానికి చెందిన గండి నానాజీ 168 మార్కులతో ప్రథమ స్థానంలో, విజయనగరానికి చెందిన జి. రమ్య మాధురి 159 మార్కులతో ద్వితీయ స్థానంలో, రాజమండ్రికి చెందిన మెరుగు అచ్యుతారావు 144.5 మార్కులతో తృతీయ స్థానం సాధించారని హోం మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ మొత్తం 5,03,486 మంది అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోగా 4,59,182 మంది ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యారన్నారు. వీరిలో 95,208 మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలకు అర్హత సాధించారన్నారు. 13 కేంద్రాల్లో నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షల్లో 95,208 గాను 38,914 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు క్వాలిఫై అయ్యారన్నారు. 10.07.2025న విడుదలైన తుది రాత పరీక్షా ఫలితాల్లో 33,921 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరతను అధిగమించడానికి ఈ నియమాక ప్రక్రియ ఎంతగానో దోహదం చేస్తుందని హోం మంత్రి అన్నారు. సెలక్ట్ అయిన 6100 మంది అభ్యర్థులకు సెప్టెంబర్ మొదటివారం నుండి ట్రైనింగ్ మొదలవుతుందని హోం మంత్రి తెలిపారు, పోలీస్ శాఖలో మిగిలిన ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు హెం మంత్రి శ్రీమతి అనిత వెల్లడించారు. 3580 సివిల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు జరిగిన నియామక ప్రక్రియలో 1,063 మంది మహిళలు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్ సైట్ అందుబాటులో ఉంటుందని, వివిధ క్యాటగిరీలకు సంబంధించిన కటాఫ్ మార్కులు కూడా వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయన్నారు.

## గత ప్రభుత్వం తొలగించిన 1.20 లక్షల పింఛన్ల పునరుద్ధరణ

### వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కారణంగా అన్ని వ్యవస్థలు నీర్వీర్యం అయ్యాయని, ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మండలం తులసిపేట గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఇంటి ఇంటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. రూ.35 నుంచి ప్రారంభమైన పింఛను నేడు రూ.4 వేలు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. 64 లక్షల మందికి రూ.34 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 1.20 లక్షల మందికి వితంతు పంఛన్లను తొలగించిందని, వాటిని నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పునరుద్ధరించామని తెలిపారు. వివిధ కారణాల రీత్యా కొన్ని తిరస్కరణ అయ్యాయని, వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి మంజూరు చేయడం జరుగుతందని హామీ ఇచ్చారు. ఒక్కరోజే 1.09 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని, సంక్షేమ పథకాలతో దుసుకుపోతున్న కూటమి ప్రభుత్వం మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా రూ.3,156 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5వేలు, కేంద్ర ప్రభుత్వం 2,000, మొత్తం 7,000 నేరుగా రైతుల ఖాతాలోకి వేస్తున్నట్లు తెలిపారు.

## ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్‌లలో స్థలాల వేలం

### - ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,ఆగస్టు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** అసంపూర్తిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్(ఎంఐజీ లేఔట్) ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలుచోట్ల ప్రారంభించిన లేఔట్లలో ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులపై యథావిధిగా లాటరీ తీసి స్థలాలు(ప్లాట్లు)కేటాయించనున్నారు. మిగిలిన స్థలాలు వాణిజ్య విధానంలో వేలం ద్వారా ప్రజలకు విక్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ పురపాలక పుట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మొత్తం 74 ప్రాజెక్టులు ప్రతిపాదించగా వీటిలో 36 ప్రారంభమయ్యాయి. మిగిలిన 38 ప్రాజెక్టుల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రారంభమైన ప్రాజెక్టుల్లోనూ 29% స్థలాలే లాటరీలో కేటాయించారు. ప్లాట్లు దక్కించుకున్న వారి నుంచి 23% మొత్తమే వసూలైంది. వార్షికాదాయ పరిమితి రూ.18 లక్షలుగా నిర్ణయించడం, లాటరీ విధానంలో స్థలాల కేటాయింపు, ఒక వ్యక్తికి ఒకే స్థలం లాంటి కారణాలు ప్రాజెక్టు అమలుకు ప్రతిబంధకాలుగా మారినట్లు గుర్తించారు.

## జగన్ తప్పు తెలుసుకోకపోతే ప్రజలు రోడ్లమీద తిరగనివ్వరు

### - ఘాటుగా విమర్శించిన తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి



**తిరుపతి,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రజలు గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి పాలనను ఛీత్కరించుకుని 11సీట్లకు పరిమితం చేసినా ఇప్పటికీ ఆయనకు బుద్ధిరాలేదని ,తన వ్యవహారశైలిని మార్చుకోపోతే ప్రజలు రోడ్లపైకూడా తిరిగనివ్వరని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి విమర్శించారు. గత ఐదేళ్ళపాలనలో చేసిన పాపాలు ఊరికేపోవని అన్నారు. అవినీతి పరులను, దొంగలను, సంస్కారం లేని వ్యక్తులను వెనుకేసుకొచ్చే జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ,కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. గురువారం జగన్ నెల్లూరు పర్యటన,తదనంతరం పరిణామాలతో సంస్కారం లేకుండా పూనకం వచ్చినట్లు విసిగిచెంది వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సిఎం చంద్రబాబు పాలనదక్షత, పారదర్శకపాలన గురించి వైసిపికి ఏం తెలుసని వ్యంగ్యంగా విమర్శించారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో మీడియాప్రతినిధులతో తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడారు. ఒక మహిళ ఎమ్మెల్యేని అసభ్యకరంగా మాట్లాడి వ్యక్తిగతంగా దూషించిన ప్రసన్నకుమార్‌రెడ్డిని ,ఒక తల్లిని అనరాని మాటలు అనిన వల్లభనేని వంశీని పరామర్శించడానికి జగన్ వెళ్ళడం విడ్డూరంగా ఉందన్నారు. వాళ్ళేమన్నా గాంధీ నెహ్రూలా అని ప్రశ్నించారు. తన కారుక్రిందపడి మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని జగన్ ,అరెస్టయిన గంజాయి ముఠాలనాయకులను, రౌడీషీటర్‌లను ,మదమెక్కి స్త్రీలను అవమానపరిచేలా మాట్లాడే సంస్కారం లేని నాయకులను పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. టీ దుకాణం నుండి మల్టీనేషనల్ కంపెనీల వరకు గత ఐదేళ్ళలో వైసిపి నాయకులు కలెక్షన్‌లు వసూలుచేశారని ఆరోపించారు. 2019 నుండి 2024వరకు ప్యాలస్‌లో కూర్చుని తెరల వెనుక పరిపాలన సాగించిన జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్రాన్ని దోచుకోని దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలు తెలియవన్నారు. వేలకోట్లరూపాయలు మద్యంస్కామ్‌లో కుంభకోణంలో వాటాలు వేసుకుని వైసిపి నాయకులు పంచుకున్నారన్నారు.

## సప్తగిరుల్లో పచ్చదనం పెంపుపై దృష్టి!

### - రూ.4కోట్లు దశలవారీగా నిధులు విడుదల



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు.. .పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు సప్తగిరులను మరింత పచ్చదనం పెంపొందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే శేషాచలం కొండల్లో తిరుమల,తిరుపతిప్రాంతంలో విస్తరించిన అటవీప్రాంతం పూర్తిగా రకరకాల ఔషదమొక్కలు, పండ్లు,వివిధ మొక్కలను టిటిడి సంరక్షిస్తోంది. ఇంకా ఈ పచ్చదనం మరింతగా పెంపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు తిరుమలకొండలు మరింత పచ్చగా కనిపించేలా అవసరమైన వివిధ రకాల మొక్కలు నాటుతున్నారు. తిరుమలకొండలు వేసవికాలంలోనూ చల్లటి వాతావరణం ఉండేది. అయితే గత దశాబ్ధంకాలంగా మార్చి,ఏప్రిల్, మే,జూన్ నెలల్లోనూ తిరుమలకొండపై పర్యావరణం కాలుష్యం పెరిగి విపరీతమైన వేడి ఉంటుంది. కొండపై కూడా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. భక్తులు ఈ వేడికి ఇబ్బందులు పడుతారు. అలాంటిది పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలు, చెట్లు ఉండాలని సిఎం ఆలోచన. టిటిడి,ప్రభుత్వ అటవీశాఖలు సంయుక్తంగా తిరుమల,తిరుపతిలో విస్తరించిన అటవీప్రాంతాన్ని పచ్చగా ఉంచేందుకు బాధ్యతలు చేపట్టాయి. ఇప్పటికే తిరుమలకొండల్లోని అడవులు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పచ్చదనంగా ఉన్నాయి. ప్రస్తుతం 68.14శాతం ఉన్న పచ్చదనాన్ని 80శాతానికి పెంచాలని ఐదునెలల క్రిందట ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పర్యటనలో టిటిడి అధికారులకు నిర్ధేశం చేశారు. సిఎం ఆశయాలకనుగుణంగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తిరుమల అడవులను పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నారు. దశలవారీగా పచ్చదనం పెంపొందించడానికి 2025-26 వార్షిక సంవత్సరానికి 1.74కోట్లు రూపాయలు నిధులు విడుదలయ్యాయి. ఇంకా రానున్న మూడేళ్ళలో 2026-27 సంవత్సరానికి 1.13కోట్లు, 2027-28 సంవత్సరానికి మరో 1.13కోట్లు

## పేదరిక నిర్మూలనలో స్వచ్ఛంద సంఘాలు భాగస్వాములు కావాలి

### జీరో పావర్టీ, పీ4లో మేము సైతమంటూ ముందుకొచ్చిన రోజ్ సొసైటీ..

**విజయవాడ.ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ పేదరిక నిర్మూలన మహాయజ్ఞమైన పీ4లో మేమూ భాగస్వాములమవుతామని.. తమ బాధ్యతగా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, ఆ కుటుంబాలకు అండగా ఉంటామంటూ రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు ముందుకొచ్చారు. శుక్రవారం సొసైటీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పీ4 విధానం విశిష్టతను వివరించారు. స్వర్ణాంధ్ర సాకారం దిశగా వేస్తున్న అడుగుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 విధానంతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని, 2029 నాటికి శూన్య పేదరికం లక్ష్యంగా ఈ విధానాన్ని అత్యంత పారదర్శకంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో పైనున్న పది శాతం మంది సమాజంలోని అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను అన్నివిధాలా పైకి తీసుకొచ్చేందుకు పీ4 విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సమాజం అండతో ఎదిగిన వారు సామాజిక బాధ్యతగా తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయాలనే గొప్ప ఆలోచనతో బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకొస్తున్నారన్నారు. జిల్లాలో 86,398 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఇప్పటికే 4,279 మంది మార్గదర్శులుగా ముందుకొచ్చి 33,505 కుటుంబాలను దత్తత తీసుకున్నారని వివరించారు.

## రూ.7కోట్లతో గిరిప్రదక్షిణ రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 1 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ నిధులతో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నామని శ్రీకాళహస్తి ఆలయాన్నితిరుమల తరహాలో తీర్చి దిద్దుటకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన రెండు కీలకమైన రోడ్ల నిర్మానానికి భూమి పూజలు జరిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధియే అజెండాగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని గతంలో ఐదేళ్ళు పరిపాలించిన నాయకుడు రూ.20కోట్లు చేయని పనులకు రూ.49కోట్లతో దిగమింగటానికి ప్రణాళికలు రచించుకున్నారని అయితే ముక్కంటీశుడు ఆయనను ఓడించి తన నిధులను కాపాడుకున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ నిధులతో రెండు రోడ్ల నిర్మానానికి శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలను ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి ఏర్పాటు చేసారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా జాతీయ రహాదారి నుంచి స్వర్ణముఖీ తీరాన సుమారు 2.45 కిలో మీటర్లు రోడ్డును శివం టు శివం రోడ్డుగా నిర్మించనున్నట్లు వివరించారు. ఈ రోడ్డు పనులకు రూ.19 టెండర్ అంచనాలతో చేపట్టుటకు శాసనసభ్యుడు సుధీర్‌ంరెడ్డి శంకు స్థాపన చేసారు.అలాగే గతంలో గిరిప్రదక్షిణ రోడ్డులో 11 కిలో మీటర్లు సిమెంటు రడ్డును నిర్మించారు. ఈ రోడ్డు మొత్తం 20కిలో మీటర్లు కాగా ఏడు కిలో మీటర్ల సిమెంటు రోడ్డు పనులకు శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి భూమి పూజలు జరిపారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర పాలనలో ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దామన్నారు.

# తిరుమల సమాచారం

## గౌహాతిలో శ్రీవారి ఆలయం నిర్మాణం

### - ఐదెకరాల స్థలం కేటాయింపునకు సిఎం హిమంత్‌బిస్వశర్మ అంగీకారం



**తిరుమల.ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** అస్సాం రాష్ట్రం గౌహతిలో టిటిడి శ్రీవారి ఆలయం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుకు ఆ రాష్ట్ర సిఎం హిమంత్ బిస్వా శర్మ అంగీకరించారు. శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, గౌహతిలో ఆరాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఐదెకరాల స్థలం కేటాయించడంతోబాటు ఆలయ నిర్మాణానికి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని సిఎం హామీ ఇచ్చారని తెలిపారు. తమ రాష్ట్రరాజధానిలో అద్భుతమైన ఆలయాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబునాయుడుకు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు పాలకమండలికి అస్సాం సిఎం కృతజ్ఞతలు తెలిపారు. కామాఖ్యఅమ్మవారి ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆచార్య డాక్టర్ జివిఆర్ శాస్త్రి పాల్గొన్నారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.25లక్షలు విరాళం



**తిరుమల,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత 25లక్షలు రూపాయలు విరాళం ఇచ్చాడు. హైదరాబాద్‌కు చెందిన పి.శ్రీకాంత్ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 25లక్షలు రూపాయలు విరాళాల డిడిని శుక్రవారం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి తిరుమలలో అందజేశారు.

## 16న కృష్ణాష్టమి వేడుకలు - ఆలయ మాడవీధుల్లో ఉట్లోత్సవం



**తిరుమల,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను టిటిడి ఘనంగా నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అష్టమితిథిన ఈ పర్వదినం జరుగుతుంది. సాక్షాత్తు ద్వాపరయుగంలో శ్రీకృష్ణపరమ్మాతుడే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించారని పురాణాల కథనం. ఈ నేపథ్యంలో కృష్ణాష్టమిని అత్యంత వేడుకగా జరిపిస్తారు. ఈనెల 16వతేదీ శనివారం ఉదయం గోగర్భమ్‌డ్యామ్ ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి ఉద్యానవనవిభాగం ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు చేస్తారు. ప్రసాద నివేదిన జరుగుతుంది. స్థానిక యువకులు ఉట్టి కొట్టడం పరిపాటి. తిరుమల స్థానికులు అన్నదానం చేస్తారు. ఆ తరువాత శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి ఆలయం ముందుకు వచ్చి అక్కడ ఏర్పాటుచేసిన ఉట్లోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఉట్లనుయువత ఉత్సాహంగా కొట్టడాన్ని స్వామివారు స్వయంగా పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా 16వతేదీ ఆలయంలో జరిగే పలు సేవలు రద్దయ్యాయి.

## తిరుపతిలో అధిక శబ్దాలిచ్చే పరికరాలు ధ్వంసం



**తిరుపతి,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ప్రశాంతవాతావరణం కల్పించేందుకు పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుందని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇటీవల తిరుపతిలో ద్విచక్రవాహనాలు,బుల్లెట్‌లు, కార్లు,జీపులకు అధిక శబ్ధాలిచ్చే సైలెన్సర్లు, హారన్లు అమర్చుకుని ఇబ్బందిపెడుతున్న వాటిని పట్టుకుని శుక్రవారం ధ్వంసం చేశారు. మోటారువాహనాల చట్టానికి విరుద్ధంగా అధిక శబ్ధాన్ని సృష్టించే సైలెన్సర్లు, హారన్లు అమర్చుకున్న వాహనాలను గుర్తించి వాటిని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి, సిఐలు సంజీవకుమార్, భాస్కర్‌నాయక్,సుబ్బరామిరెడ్డి సిబ్బంది చర్యలు తీసుకున్నారు. చాలామంది వాహనదారులు తమ పొరబాటును గుర్తించి స్వచ్ఛందంగా ఇలాంటి వాటిని తొలగించుకున్నారని ఎస్పీ తెలిపారు. పట్టుబడిన వాహనాలకు చెందిన పరికరాలను ఏఆర్ పోలీసు గ్రౌండ్‌లో నిర్వీర్యం చేశారు.

## జూలైలో పెరిగిన హుండీ ఆదాయం - రూ.130కోట్లు

**తిరుమల,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల శ్రీవేంకటేశ్వరస్వామికి వరుసగా జూలై నెలలోనూ కానుకల రూపంలో హుండీ ఆదాయం వందకోట్లరూపాయలుపైగానే రికార్డు చేకూరింది. సుమారు 130 కోట్ల రూపాయల ఆదాయం నమోదైంది. జూలైనెలకు సంబంధించి గత 31రోజుల హుండీ ఆదాయం 129.48కోట్లు దాటడం విశేషం. గత ఏడునెలల్లో జూలైలోనే అధికంగా చేకూరింది. గత ఏడాది జులైలో 125కోట్ల రూపాయలు హుండీ ద్వారా ఆదాయం రాగా, 2023 జూలైలో 139.45కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది. దేశవిదేశాల్లోని భక్తులు తమ ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు భారీగా తరలి వస్తున్నారు. తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పించుకోవడం కనిపిస్తోంది. భక్తుల రద్దీతో బాటు మొక్కుబడుల రూపంలో కానుకలు హుండీకి భారీగానే చేరాయి. ప్రతిరోజూ సరాసరి 3.50-4కోట్లురూపాయలు వరకు హుండీ ఆదాయం లభించింది. జులైలో వరుసగా 28న 5.44 కోట్లు రూపాయలు, 14న 4.72కోట్లు,10, 4.54కోట్లు,31 4.66కోట్లు 8న 4.33కోట్లు, 7న 4.43కోట్లు, 6న 4.39కోట్లు, 29న 4.89కోట్లు రూపాయలు,

23న 4.55కోట్లు, 22వతేదీ 4.42కోట్ల రూపాయలు ఇలా వరుసగా సరాసరి రోజుకు 4కోట్లరూపాయలు దాటిన రోజులే ఎక్కువ.గతనెలలో 16న ఆణివార ఆస్థానం ప్రత్యేక పర్వదినం.

సహజంగా వేసవిసెలవులు ఏప్రిల్, మే నెలలో, ఆ తరువాత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో హుండీ ఆదాయం 130కోట్లు రూపాయలవరకు నమోదవుతుంది.

ఇక భక్తుల విషయానికి వస్తే గత నెలలో సరాసరి 23.63లక్షల మంది భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.


## సీమలో మరో రెండు కీలక సెక్షన్‌లలో ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 1,ప్రభాతవార్త** రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఆటోమెటిక్ సిగ్నల్(ఎబిఎస్) వ్యవస్థ రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో మరో రెండు కీలక సెక్షన్‌లలో అందుబాటులో వచ్చింది. సుమారు రూ.750కోట్ల అంచనా వ్యయంతో 536.57కి.మీల రైలుమార్గాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. భారతీయ రైల్వేలోనే అత్యధిక కిలోమీటర్లను ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. ఈ రైళ్ల నిర్వహణలో ఎలాంటి అవరోధం, ఆలస్యం కలుగకుండా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ వ్యవస్థను డబ్లింగ్ రైలు(అప్ అండ్ డౌన్)రైలు మార్గాలను ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. గుంతకల్లు డివిజన్‌లో రేణిగుంట-గుంతకల్లు-వాడి మార్గంలో పనులను ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా ఆదోని-వాడి సెక్షన్ మద్రిచెట్టాల్- మట్మారి-మంత్రాలయం సెక్షన్‌లో 19.50కి.మీలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను అందుబాటులో తెచ్చింది. ఈ సెక్షన్‌లో రెండు బ్లాక్ సెక్షన్‌లతో పాటు, 23ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నళ్లను, 3మ్యాన్డ్ లెవెల్ క్రాసింగ్ గేట్లలో ఈ ఆధునిక సాంకేతిక సిగ్నల్,టెలికాం వ్యవస్థను ఏర్పాటు

# బాలకృష్ణకు సిఎం సహా పలువురు అభినందన

విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి: అనిల్ రావిపూడి దర్శకత్వంలో నట సింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర హీరో నందమూరి బాలకృష్ణకు పలువురి ప్రముఖుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చిత్రం 2023, అక్టోబర్ 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. హీరో బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, అర్జున్ రాంపాల్, శ్రీలీల ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. తెలుగు సినీ హీరో, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమాకు 2023 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. నాడు ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రానికి ఇప్పుడు అవార్డులు కూడా రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నందమూరి బాలకృష్ణ గారికి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం చాలా సంతోషం.లోకేష్ ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ. 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో బాలా మామయ్య హీరోగా నటించిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం చాలా సంతోషం. బాలా మామయ్య నటన, సందేశాత్మక చిత్రంగా ప్రేక్షకుల మన్ననలు అందుకున్న భగవంత్ కేసరికి నేషనల్ అవార్డు వచ్చిన సందర్భంగా బాలా మామయ్యకు, డైరెక్టర్ అనిల్ రావిపూడి గారికి, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. భగవంత్ కేసరి చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడంపై ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. భగవంత్ కేసరి చిత్రం అటు ప్రేక్షకాదరణ.. ఇటు అవార్డులు రెండు అందుకుందని తెలిపారు. హీరో బాలయ్య బాబు మమల్ని ఎంతో సపోర్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు. కథను నమ్మి మేము చేసిన ఈ ప్రయత్నానికి గుర్తింపు లభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి సినిమాను బాధ్యతగా చేస్తామని.. కానీ ఇప్పుడు అది మరింత పెరిగిందన్నారు. ఈ అవార్డు మా ఉత్సాహాన్ని పెంచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఓ బ్లాక్ బస్టర్ హిట్.

# తండ్రి పోలీస్ - ముగ్గురు కుమారులు పోలీసులుగా ఎంపిక



పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన సోదరులు (ఫైల్‌ఫోటో)

**గుత్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంది. తండ్రి ఆశయాలను నెరవేర్చే రీతిన, కుమారులు సైతం ఆయన దారిలోనే వెళ్లి తన తండ్రి ఆశయాలను సాధించిన గొప్ప ఘనత ఆ కుమారులకు దక్కింది. వివరాల్లోకి వెళితే...గుత్తి పట్టణంలోని జెండా వీధిలో నివాసముంటున్న మహబూబ్ దౌలా తొలుత ఏఆర్ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముగ్గురు కుమారులు మహమ్మద్అలీ, మహమ్మద్‌గౌస్, మహమ్మద్‌సమీర్‌లు పట్టుదలతో తాము సైతం పోలీస్ శాఖలో చేరి ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నారు. తండ్రి ఆశయ సాధనకు అనుగుణంగానే వారు శ్రమించారు. చివరకు శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ఫలితాల్లో ఆ ముగ్గురు సోదరులు ఉత్తీర్ణత సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగాలకై ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ముగ్గురు సోదరులు పోలీస్ శాఖలో ఏకంగా ఎంపిక కావడం గుత్తి పట్టణంలో సంచలనం సృష్టించింది.

పలువురు నిరుద్యోగులు నిరాశతో తమకు ప్రభుత్వ కొలువులు రావన్న ఆవేదనతో తమ జీవితాలను వెళ్లబుచ్చుతున్న వారు ఈ ముగ్గురు సోదరులను చూసి స్ఫూర్తిదాయకంతో పట్టుదలతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలంటూ పలువురు పట్టణ ప్రముఖులు సూచిస్తున్నారు. వారి ఎంపిక పట్ల పలువురు అభినందిస్తున్నారు. ప్రస్తుతం ఆ కుటుంబం ఉద్యోగరీత్యా జిల్లా కేంద్రంలో స్థిరపడింది. భవిష్యత్తులో ఆ ముగ్గురు సోదరులు పోలీస్ శాఖలో ఉన్నత స్థాయి పదవులను చేపడతారన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# బిజెపి అడుగులకు మడుగులొత్తుతున్న డబుల్ ఇంజన్ కూటమి సర్కార్ : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ




జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా సిపిఐ ద్వితీయ మహాసభలో ప్రసంగిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.

**జగ్గయ్యపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ కూటమి సర్కార్ కేంద్రంలోని బిజెపి అడుగులకు మడుగులొత్తుతూ ప్రజావ్యతిరేక పరిపాలన చేస్తున్నారని భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆరోపించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం జరిగిన జిల్లా సిపిఐ ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత వందలాది మంది పార్టీ కార్యకర్తలు, మహిళలతో ఎర్రజెండాలు చేతపట్టి పట్టణ ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు జిల్లా పార్టీ కార్యదర్శి దోనెపూడి శంకర్ అధ్యక్షత వహించారు. సభలో జాతీయ నాయకులు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ జెన్ని విల్సన్, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి పరుచూరి రాజేంద్ర, స్థానిక నేతలు అంభోజి శివాజీ, జూనెబోయిన శ్రీనివాసరావు, పోతుపాక వెంకటేశ్వర్లు, నీలకంఠ శివప్రసాద్, మెటికల శ్రీనివాసులు, మాశెట్టి రమేష్ బాబు, భోగ్యం నాగులు, మహ్మద్ అసదుల్లా, కరీం సిపిఐ కార్మిక సంఘాల నాయకులు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ప్రజలకు ఏమాత్రం మేలు చేయలేని పార్టీ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. కేంద్రం ప్రజల నడ్డివిరిచి అంబాని, ఆదానిలకు సంపదను దోచిపెడుతుందన్నారు. చిల్లర వర్తక వ్యాపారాలు, చిన్న మధ్య తరహా కుటీర పరిశ్రమలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని నిందించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆదాని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక అదే బాటలో నడుతుందని ఇది సిగ్గుచేటని దుయ్యబట్టారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. కొందరు మాత్రం ఆదానీ కారిడార్‌గా ప్రకటిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారంటూ విమర్శించారు.

# విద్యారంగంలో నూతన సంస్కరణలకు నారాయణ శ్రీకారం

## సాంకేతిక సహకారానికై గూగుల్ క్లౌడ్ ఇండియాతో అవగాహన ఒప్పందం



**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :**విద్యారంగంలో నవ శకానికి నాంది పలికే విధంగా ఆసియాలో అతి పెద్ద విద్యాసంస్థలలో ఒకటైన నారాయణ విద్యాసంస్థ, గూగుల్ క్లౌడ్ ఇండియాతో సాంకేతిక సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తాజా జనరేటివ్ ఏఐ, క్లౌడ్ పరిజ్ఞానంతో విద్యారంగంలో నూతన సంస్కరణలు చేపట్టేందుకు, విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నారాయణ విద్యాసంస్థ గూగుల్ క్లౌడ్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, అద్భుతమైన ఫలితాలు సాధించేలా విద్యను అందించడంలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఒప్పందం ప్రకారం, నారాయణ సంస్థ తమ మొత్తం డిజిటల్ మౌలికసదుపాయాలను గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫ్లామ్ (జిసిపి)తో అనుసంధానం చేయనుంది. దీనివల్ల విద్య మరింత మెరుగు పడుతుంది. ముఖ్యంగా భారత్‌లోని చిన్న పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా విద్య రంగంలో కొత్త ఆవిష్కరణలకు దోహదపడేలా గూగుల్ క్లౌడ్‌కి అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించనుంది. నారాయణ సంస్థ గూగుల్ క్లౌడ్ అస్టేటెడ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ జెమినీ 2.5 ప్రో, జెమినీ ఫ్లాష్ లను వెర్టెక్స్ ఏఐ ద్వారా వినియోగించబోతున్నారు. దీని ద్వారా ప్రతి విద్యార్థి అవసరాలకు అనుగుణమైన సౌకర్యవంతమైన లెర్నింగ్ సిస్టమ్స్ అభివృద్ధి చేయబడతాయి. ప్రతి విద్యార్థి ప్రతిభ, నేర్చుకునే వేగం, విద్యాశైలి ఆధారంగా ఏఐ ఆధారిత విద్యా ప్రయాణాలు రూపొందించబడతాయి. నారాయణ సంస్థ గూగుల్ భాగస్వామ్యం, భారత విద్యా రంగాన్ని ప్రస్తుతానికి తగ్గట్టుగా కొత్త మార్గాల్లో ముందుకు తీసుకెళ్లబోతోంది. నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ గూగుల్ క్లౌడ్ ఇండియాతో కలిసి విద్యను కొత్త దిశగా తీసుకెళ్తుంది. కొత్త ఒప్పందం ద్వారా విద్యార్థులకు వ్యక్తిగత అవసరాలపై దృష్టి పెట్టే, అందరికీ ఉపయోగపడే విధంగా ఫలితాలను ఆవిష్కరించే విద్యావిధానాలను అభివృద్ధి చేయనుంది. నారాయణ గ్రూప్ తమ డిజిటల్ వ్యవస్థను పూర్తిగా గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫ్లామ్‌తో అనుసంధానించనుంది. దీని వల్ల నారాయణ విద్యను మరింత మెరుగుపరిచేందుకు, ప్రత్యేకించి చిన్న పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు మార్గం సుగమమవుతుంది. గూగుల్ క్లౌడ్ ఆధునిక ఏఐ టెక్నాలజీతో విద్యా రంగంలో కొత్త సాధనాలు అభివృద్ధి చేయటానికి అవసరమైన సాంకేతిక మద్దతును అందిస్తుంది. నారాయణ, గూగుల్ క్లౌడ్ రూపొందించిన పెద్ద లాంగ్వేజ్ మోడల్స్ (జెమిని 2.5 ప్రో, జెమిని ఫ్లాష్) ఆధారంగా స్టూడెంట్లకు అనుగుణంగా పనిచేసే స్మార్ట్ లెర్నింగ్ టూల్స్ తయారు చేయనుంది. నారాయణ విద్యాసంస్థల అధ్యక్షుడు పునీత్ కొత్తవ మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి ప్రత్యేకం. అందుకే అతని చదువూ ప్రత్యేకంగా ఉండాలి. ఈ భాగస్వామ్యం ద్వారా నారాయణ డిజిటల్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకి అవసరమైన విధంగా ఏఐ ద్వారా సహాయం అందించబోతున్నామన్నారు. ఈ టెక్నాలజీ అంతా నారాయణ గ్రూప్‌కి చెందిన ఎన్ లెర్న్, ఎన్ కాన్సెప్ట్ అనే డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా అందించబడతాయన్నారు.

## నీటి పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నీటి పన్ను బకాయిలపై వడ్డీ రూ.85.81 కోట్లను ఒకేసారి మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భూ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎఫ్‌ఎసి) జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 సంవత్సరం వరకూ సాగునీటి పన్నులకు సంబంధించిన బకాయిలపై వడ్డీని రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.గత ఏడాది రెండు తరుణాల్లో ఎదుర్కొన్న నష్టాల రీత్యా సాగునీటి పన్ను మినహాయింపును ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ దిశలో చర్యలు తీసుకుంటామని ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వాగ్దానం చేసారు.ఆ మేరకు సాగునీటి పన్నును రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

**పెంచలకోన(రాపూరు, నెల్లూరు), ఆగస్ట్ 1, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి శుక్రవారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రంతో పాటు ఈ వారం శ్రావణ మాసం కావడంతో ఉదయం ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, పూలంగీ సేవ, ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం ముందు కుంకుమ పూజ నిర్వహించారు. తెల్లవారుజామున నృసింహ స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికింతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్ణ గరుడవాహనంపై వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలోపెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన,వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులున్నారు..స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు



**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో ఐఎస్ఓ 21001:2018 సర్టిఫికేట్ జారీ అయ్యింది. చిత్తూరు అపోలో యూనివర్సిటీతో పాటు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని అపోలో నర్సింగ్ కళాశాలకు సైతం ఈ సర్టిఫికేట్ లభించింది. ఈ సర్టిఫికేట్ విద్యాసంస్థల నిర్వహణ నాణ్యతకు సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మక గుర్తింపు. చిత్తూరు అపోలో యూనివర్సిటీ లోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం సర్టిఫికేట్ హ్యాండోవర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. బిఎస్ఐ ఇండియా డైరెక్టర్ ఎం.మహేష్ మల్పధక్ ఐఎస్ఓ 21001:2018 సర్టిఫికేట్లను యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పోతురాజు, చిత్తూరు అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి, చెన్నై అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యశక్తిలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్‌భట్ మాట్లాడుతూ అపోలో యూనిర్సిటీ ఆధునిక విద్యా ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన విద్యను అందించడంలో విశ్వసనీయతను చాటుకుందని, ఐఎస్ఓ సర్టిఫికేట్ పొందడం ద్వారా తమ విద్యా, పరిపాలన విధానాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వున్నాయని నిరూపించుకున్నామన్నారు. ప్రస్తుతం నాక్ అక్రిడిటేషన్ ప్రక్రియలో వున్నామని, వచ్చే ఏడాది జూన్ నాటికి నాక్ గుర్తింపు పొందే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అపోలో నాలెడ్జ్ సిఇఓ శివరామకృష్ణన్ వర్చువల్‌గా మాట్లాడుతూ ఈ సర్టిఫికేట్ అపోలో యూనివర్సిటీకి గౌరవం మాత్రమే కాక బాధ్యతను కూడా పెంచిందన్నారు.

## టిడిపి పార్టీ వ్యక్తిగత స్వార్థాలకు వేదిక కాదు: పల్లా

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 1, ప్రభాత వార్త :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాలకొండ నియోజకవర్గ నాయకుల నిరక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం విశాఖపట్నం పార్లమెంటు కార్యాలయంలో నిర్వహించిన పార్టీనేతల పనితీరుపై సమీక్షా సమావేశంలో, పార్టీ కీలక కార్యక్రమాలపై నేతల ప్రవర్తనను ఆయన తీవ్రంగా విమర్శించారు. టీడీపీ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు "సుపరిపాలనతొలి అడుగు" వంటి కార్యక్రమాల్లో పాలకొండ నేతల నిరక్ష్యంగా వ్యవహరించారని పల్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత స్వార్థం కోసం గ్రూప్ రాజకీయాలు చేస్తే, అధినాయకత్వం కఠిన చర్యలు తీసుకొంటుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ వ్యక్తిగత స్వార్థాలకు వేదిక కాదని, ఇది కార్యకర్తల పార్టీ.. ప్రతి ఒక్కరు పార్టీ విధానాల్ని గౌరవిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ఇన్చార్జి పాలకొండ ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతాన్నికి కృషి చేయాలని ఆదేశించారు.

## టిడిపి హయాంలోనే అసలైన మద్యం అవినీతి

### - వైయస్‌ఆర్‌సిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తరపతినిధి:** సీఎం చంద్రబాబు చంద్రబాబు తన అవినీతిపై ప్రజల దృష్టిని మళ్ళించేందుకే లేని లిక్కర్ స్కాంను సృష్టించారని వైయస్‌ఆర్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు.నేరాలు,దుర్మార్గాలు చేయడం అవి ఎదుట పక్షంపై వాటిని నెట్టడం చంద్రబాబుకు అలవాటైందన్నారు.ఆయన భజన సంస్థలు వైకాంగ్రెస్ పార్టీపై విష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వారికి తగిన మూల్యమే చెల్లిస్తారన్నారు.విజయవాడలోని ఏసీబీ కోర్ట్ బయట మీడియాతో మాట్లాడుతూ కట్టుకథలు, పిట్టకథలతో లిక్కర్ స్కాం దర్యాప్తును రోజుకో మలుపు తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో దొరికన నోట్ల కట్టలకు, లిక్కర్ స్కాంలో అక్రమ కేసులు బనాయించిన వారికి అంటగట్టి కుట్రపూరితంగా బురదచల్లే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 2014- 19 మధ్య చేసిన అవినీతి నుంచి తప్పించుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్ళించేందుకు లిక్కర్ స్కాంను సృష్టించారు. ఈ స్కాంతో దుబాయ్, హైదరాబాద్‌లకు సంబంధం ఉందని, ఎన్నికల్లో ఈ డబ్బును ఖర్చు చేశారని, బంగారం కొన్నారని ఇలా నోటికి ఏది వస్తే దానిని మాట్లాడుతున్నారు. మొదట్లో మొత్తం రూ.50 వేల కోట్లు అన్నారు, తరువాత దానిని తగ్గించుకుంటూ వచ్చి ఇప్పుడు రూ.3500 కోట్లు అంటున్నారు. కనీసం ఎక్కడ స్కాం జరిగిందో, ఎలా చేశారో కూడా సిట్ అధికారులకే ఒక స్పష్టత లేదు. వైయస్‌ఆర్‌సీపీ హయాంలో లిక్కర్ స్కాంలో ఎక్కడ పాలసీని ఉల్లంఘించారు.

## వైభవంగా ముగిసిన అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు..

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ, పున్నమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా ముగిసాయి. ఈ మేరకు ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున శుక్రవారం తెలిపారు. చివరి రోజు 5,000 మందికి పైగా అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జూలై 26వ తేదీ నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించామని.. చివరి రోజు గురువారం మహాపూర్ణాహుతి, ఆలయప్రవేశం, మహాసంప్రోక్షణ, అక్షతారోహణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బ్రహ్మఘోషతో కార్యక్రమం ముగిసినట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విశేష హోమాలు కార్యక్రమంలో పాల్గొని.. స్వామి వారిని దర్శించి అన్న ప్రసాదం స్వీకరించారని మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషిచేసిన దాతలు, టీటీడీ అర్చక స్వాములు, వేద పండితులు, సేవకులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా అన్నదాతా సుఖీభవ

### - పిఎం కిసాన్ పథకం అమలు - కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1, ప్రభాతవార్త** మన జిల్లాలో అన్నదాత సుఖీభవ మొదటి విడతలో మొత్తం 1,95,866 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం 97.933 కోట్లు రూపాయలు ఆర్థిక సహాయం లభించనుందని తెలిపారు. అదే విధంగా పి యం కిసాన్ 20వ విడత కింద జిల్లా వ్యాప్తంగా 1,68,350 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున 33.67 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం లభించనుందన్నారు. ఈ పథకం రాష్ట్ర స్థాయి ప్రారంభ కార్యక్రమం ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గం పరిధిలోని ఈస్ట్ వీరయ్యపాలెం గ్రామంలో ఆగస్టు 2న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగనుందని, అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు మరియు అన్ని రైతు సేవ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరగనుందని వివరించారు. అలాగే జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఆగస్టు 2న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు వారణాసిలో ఉదయం 11 నుండి 12 గంటల మధ్య ప్రారంభించనున్నారని తెలిపారు. దీనిద్వారా సాగుదారుల కుటుంబాలు అనగా స్వంతంగా సాగు భూమిని కలిగిన రైతు కుటుంబాలు మరియు ఆర్ఓఎఫ్ఆర్ భూములు సాగుచేసే కుటుంబాలకు రూ.20,000 వార్షికంగా ప్రయోజనం లభిస్తుంది.

ఇందులో రూ.6,000 కేంద్ర ప్రభుత్వం నుండి పీఎం కిసాన్ పథకం ద్వారా, రూ 14000 రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ విడతలో ప్రతి రైతుకు ఏడిఎస్‌బి కింద 5 వేలు, పీఎం కిసాన్ కింద 2 వేలు కలిపి మొత్తం 7 వేల ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. ఒకవేళ ఈ విడత లో అర్హత కల్గిన రైతులు ఆర్థిక సహాయం పొందనట్లయితే మీ సమీపంలో ఉన్న రైతు సేవకేంద్రము ను సంప్రదించి అవసరం అయిన పత్రాలు సమర్పిస్తే మలివిడత లో మొత్తం పొందవచ్చునని వివరించారు. అలాగే 2025 - 26 సంవత్సరానికి సంబంధించిన నియోజకవర్గాల వారీగా, అన్నదాత సుఖీభవ -మొదటి విడత మరియు పీఎం కిసాన్ 20వ విడత లబ్ధిదారుల వివరాలను పట్టిక ద్వారా అందజేయడమైనది.

## సచివాలయంలో ఆగస్ట్ 10 నుంచి ప్లాస్టిక్‌బాటిళ్ల నిషేధం

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సచివాలయంలో ఆగస్ట్ 10 నుంచి ప్లాస్టిక్ బాటిళ్ల నిషేధాన్ని విధించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఒక్కో స్టీల్ వాటర్ బాటిల్ సచివాలయంలోని ఉద్యోగులందరికి ఇస్తామని ప్రకటించింది. అన్ని శాఖలకు రీ యూజబుల్ బాటిళ్లు అందిస్తాముని తెలిపింది. సచివాలయానికి ఎవరు కూడా బయట నుంచి వాటర్ బాటిళ్లు తేకూడదని స్పష్టం చేసింది.గతంలో సీఎం చంద్రబాబు సే నో..టు ప్లాస్టిక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ఉద్దేశం ఏపీలోని ముఖ్య నగరాలను ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నది. అయితే ఈ కార్యక్రమం పూర్తిగా కార్యరూపం దాల్చకపోవడంతో సే నో..టు ప్లాస్టిక్ అనేది కేవలం నినాదంగానే మిగిలిపోయింది.ప్లాస్టిక్ నిషేధంపై ఏపీ ప్రభుత్వం తనదైన రీతిలో కొత్త కార్యచరణ మొదలుపెట్టింది. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అన్న తీరులో ప్లాస్టిక్ నిషేధాన్ని ఏపీ సచివాలయం నుంచి మొదలుపెట్టనుంది.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిర్మూలించాలన్న ఆదేశాలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఏపీ సచివాలయంలో ప్లాస్టిక్ బాటిళ్లను నిషేధిస్తూ.. తీసుకున్న నిర్ణయం చూస్తుంటే మరోసారి ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం.

## వైకాంగ్రెస్ నేత జగన్ పట్ల సిఎం చంద్రబాబు సంయమనం పాటిస్తున్నారు

### - బిజెపి ఎంపి సిఎం రమేష్

**విజయవాడ,ఆగస్టు1,ప్రభాతవార్తప్రతినిధి:**సీఎం చంద్రబాబును,ఎన్డీఏ ప్రభుత్వాన్నివిమర్శించే నైతిక హక్కు వైకాంగ్రెస్ పార్టీ నేత జగన్‌కు లేదని భారతీయ జనతాపార్టీ ఎంపీ సిఎం రమేష్‌చంద్రబాబు జగన్ లాంటి కక్ష సాధింపు వ్యక్తిత్వం కాదన్నారు. ఏపీలో కక్ష సాధింపు సంస్కృతి తెచ్చిందే జగన్ అని విమర్శించారు. వైకాంగ్రెస్‌పార్టీ కక్ష సాధింపు జాబితా పంపుతానని,జగన్ చదువుకోవాలని ఎద్దేవా చేశారు. 'చంద్రబాబు సంయమనం వల్లే జగన్ ఇంకా రోడ్లపై తిరుగుతున్నారు. పెద్దిరెడ్డిపై సిఎంకు కక్షసాధింపు ఉంటే ఎప్పుడో చర్యలుండేవి. ఆయన కేవలం రాష్ట్రం మంచి కోసమే ఆలోచిస్తున్నారు. జగన్ రాకముందు రాష్ట్రంలో కక్షసాధింపులు లేవు.వైకాపా పాలనలో కూటమి నాయకులు,కార్యకర్తలను ఇబ్బంది పెట్టారు. చంద్రబాబు,పవన్‌ను బయటకు రాకుండా అడ్డుకున్నారు. వైకాపా నాయకులు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటే సిఎం పిలుపే కారణం.వైకాపా హయాంలో జరిగిన ప్రతి అవినీతిపై సిఎం చంద్రబాబు విచారణ జరిపించాలి. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది సరిపోకపోతే సిబీఐ,ఈడీ సహకారం కోరతాం.

## మెట్టప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం : మంత్రి ఆనం

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగస్ట్ 1, ప్రభాతవార్త :** మెట్టప్రాంత నిరుద్యోగ యువతకు మంచి భవిషనయత్‌ను అందించి ఈప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళాను నిర్వహించామని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి ఆనం సారధ్యంలో మెగా జాబ్‌మేళాను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి , జిల్లా కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలనతో జాబ్‌మేళాను ప్రారంభించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ కెంపెనీల చుట్టూ తిరగకుండా కంపెనీలే మనముందుకొచ్చి ఉద్యోగాలి చ్చేలా మెగా జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామని, ఇంతటి గొప్ప సువర్ణ అవకాశాన్ని నిరుద్యోగ యువత అందరూ సద్వినియోగం చేసుకోవాల న్నారు. జిల్లాలో ఇంత పెద్ద జాబ్‌మేళా గతంలో ఎప్పుడూ జరగలేదని, ఆత్మకూరు చరిత్రలో నిలిచేలా మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులపాటు ఈ జాబ్‌మేళా ను నిర్వహిస్తామన్నా రు. సుమారు 90 కిపైగా రాష్ట్ర, జాతీయ స్థాయి కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని, సుమారు 3వేలకు పైగా యువతీ యువకులు రిజిస్ట్రేషన్లు చేసుకొని జాబ్‌మేళాలో పాల్గొంటున్నార న్నారు. నిర్దిష్ట ప్రక్రియల మేరకు ఎంపికలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్, స్పాట్ రిజిస్ట్రేషన్‌లు, విద్యార్హతల పరిశీలన, కంపెనీల ఎంపిక, ఇంటర్వ్యూలు, స్పాట్ అపాయింట్‌మెం ట్‌లు వంటి దశల వారీగా ఎంపిక పూర్తిచేస్తున్నార న్నారు. మెట్ట ప్రాంత నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తు కోసం గుండ్రా సతీష్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశామన్నారు. జాబ్‌మేళాకఉ వచ్చిన ప్రతి ఒక్కరికి ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గొప్ప సంకల్పంతో ఈ జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టారన్నారు. పదేపదే జాబ్‌మేళాపై తనతో మాట్లాడుతూ ఎక్కువ కంపెనీలు వచ్చేలా కృషి చేశారని, అధికారులు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించి అందరిని సమన్వయం చేసుకుంటూ అన్నీ తానై ముందఉకు నడిపించారన్నారు. నిరుద్యోగ యువత అందరూ మన ఇంటి ముందుకు వచ్చిన ఉద్యోగాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్ పొందాలని పిలుపునిచ్చారు. సుమారు 30కిపైగా కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని ప్రతి ఒక్కరూ ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తప్పుచేస్తే ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే:మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**కొలిమిగుండ్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల కేంద్రంలో గత బుధవారం శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయ పున:ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కాన్సిస్టేబుల్‌పై మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమీప బంధువు బీసీ మదనభూపాల్‌రెడ్డి చేయిచేసుకున్న విషయం విధితమే. విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై చేయిచేసుకోవడం తన బంధువైనా తమ్ముడైనా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు జరగడానికి ఏమాత్రం తావు లేదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి తమ తమ్ముడైనా మరేవరైనా తప్పుచేసిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 1,950 ఇందిరమ్మ ఇళ్లు రద్దు

## కేటాయించిన సెక్రటరీలపై వేటు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి ప్రభుత్వం భారీ షాకి చ్చింది. 1,950 మంది ఇళ్లను రద్దు చేసింది. వీరంతా బెస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తిచేసి, తొలివిడత ఆర్థిక సాయం రూ.లక్ష కోసం దరఖాస్తుచేసుకున్న సమయంలో ప్రభుత్వం వీరి ఇళ్లను రద్దు చేసింది. వీరి స్థానంలో కొత్త వారికి ఇళ్లను కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పేదవారి సొంతింట కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించగా ప్రస్తుతం అవన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఒకేసారి పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం ఎంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా. కొన్నిచోట్ల అనర్హులకు ఇళ్లు దక్కుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్య దర్శులు చేస్తున్న తప్పులతో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నట్లు అధికారులు గుర్తించారు. హౌసింగ్ వెరిఫి కేషన్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 1,950 మందిఅనర్హులు ఇందిరమ్మ ఇళ్లు పొందినట్లు వెల్లడైంది. బెస్‌మెంట్ పూర్తయిన తరువాత.. మొదటి విడతలో భాగంగా రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ 1,950 మంది అనర్హులను గుర్తించారు. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ మాట్లాడుతూ.. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇండ్లను రద్దు చేసి.. వీరికి బదులు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు బాధ్యులైన సెక్రటరీలను సస్పెండ్ చేశాలని తెలిపారు. ఈ పథకానికి సంబందించి మొదటి విడతలో. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నామని ఎండీ గౌతమ్ తెలిపారు. అయితే తాజాగా చేపట్టిన తనిఖీల్లో అనర్హులుగా గుర్తించిన ఈ 1950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి. బెస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేసిన వారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు వీరి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దశల వారీగా పలువురు అధికారులు. ఆపై కలెక్టర్ ఆమోదం తెలిపిన తర్వాతే .. లబ్ధిదారులకు బిల్లలు చెల్లిస్తున్నామన్నారు. ఐనప్పటికి కొన్ని చోట్ల తప్పులు జరిగి.. అనర్హులు కూడా ఇళ్లు పొందారన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి తప్పులు జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని గౌతమ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనల గురించి ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో ఫొటో క్యాప్చర్ సమయంలో సెక్రటరీలు తప్పులు చేస్తున్నారని దీనిలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో జరగాలని.. కచ్చితంగా రెండు రూమ్‌లు, కిచెన్, బాత్రూం నిర్మించాలని సూచించారు. పునాదికి ముందు వైపు, పక్కల వెంట, పై నుంచి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు దశల వారీగా హౌసింగ్ ఏఈలు తనిఖీ చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

## బనకచర్లను తాకట్టు పెట్టింది గత ప్రభుత్వమే

### వారి తప్పలు బయటపడతాయనే సర్కారుపై ఆరోపణలు

### బిఆర్ఎస్‌పై పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మండిపాటు

**పరిగి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు, కెటిఆర్ లపై టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు.. జనహిత పాదయాత్ర లో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం పిసిసి మహేష్ కుమార్ గౌడ్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన బీసీల రిజర్వేషన్లకూ, బిఆర్ఎస్ పార్టీకి, కవితకు సంబంధం ఏంటని అన్నారు. రిజర్వేషన్లు, కులగణనలతో దేశానికి రోల్‌మోడల్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని, సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతను చాటాడని, చారిత్రా త్మక నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. బనకచర్ల విషయంలో ముమ్మాటికీ గత పాలకులదే తప్పిదమని స్పష్టం చేశారు. కేసీఆర్, హరీశ్‌రావులు కలిసి బనకచర్లను ఆంధ్ర కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాజకీయాలు చేసి ఆంధ్ర పాలకులకు మేలు చేశారని, వారు చేసిన తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు... తాకట్టు పెట్టిన వాటాను వెనక్కి తేవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు బురదజల్లుతున్నారుని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో 2014 నుండి మొన్నటి వరకు గత పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా వివరించాడని మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.. బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ నేపథ్యంలో కేంద్రానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామన్నారు.. బీఆరెస్స్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయనే, ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని, బిఆర్ఎస్ నేతల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. బనకచర్ల విషయంలో బీఆరెస్స్ ప్రభుత్వం తప్పు చేసిందని, సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలిపారు.

## భూదాన్ కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా నాగారంలో భూదాన్ భూముల వివాదంపై కమిషన్ వేయాలా...? వద్దా...? అనేదానిపై తా ము త్వరలో తేలుస్తామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దీనిపై తీర్పురు రిజర్వ్ చేసింది. మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నంబర్ 181, 182, 194, 195 నంబర్లలో గల భూదాన్ భూములు అన్యక్రాంతం అయ్యాయని ఇప్పటి కే హైకోర్టులో వేరు వేరుగా పిటిషన్లు దాఖలవడం తెలిసిందే. ఈ సర్వే నంబర్లలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు కొందరు వ్యాపారులు అక్రమంగా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారించి భూదాన్ భూముల్లో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించడంతో పాటు ఈ మేరకు హైకోర్టుకు నివేదిక కూడా ఇచ్చింది. అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేష్, పడమటి తాండ నివాసి రాములు భూదాన్ భూముల్లో అక్రమాలపై చాలా కాలం నుంచి పోరాడుతూ ఇదే విషయమై న్యాయస్థానాలను ఆశ్రయించడం తెలిసిందే. ఇక్కడ జరుగుతున్న భూకబ్జాలపై అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటి షన్లపై జస్టిస్ లక్ష్మణ్ విచారించి దీనిపై తీర్పును రిజర్వ్ చేశారు. ఇక్కడ అక్రమాలు జరుగుతున్న దానిపై ఎలా చేయాలనే దానిపై తాము త్వ రలో నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (కెపిహెచ్‌బికాలనీ), ఆగస్టు 1, ప్రభాతవార్త:** పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థిని సరిగా చదవడం లేదని ఉపాధ్యాయులు సిబ్బంది మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని బిల్డింగ్‌పై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కెపిహెచ్బి కాలనీలోని మంజీర ట్రినిటీహోమ్స్‌లో నివాసముంటున్న ఆకుల హరి నారాయణమూర్తి కుమార్తె లాస్య ప్రియ (13) కాలనీలోని అడ్డగుట్టలోని నారాయణ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతోంది. ఆమె ఎప్పటిలాగే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిం దని, ఆ తర్వాత పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు ఫోన్ చేసి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం గురించి నాలుగు గంటలకు తెలియజేసిందని పేర్కొన్నారు. లాస్య ప్రియ తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారు. పేరెంట్స్ మీటింగ్‌లో పాఠశాల ఉపాధ్యాయులు లాస్య ప్రియ బాగా చదవడం లేదని చదువుపై దృష్టి పెట్టడం లేదని సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులను ఆమెకు కౌన్సెలింగ్ ఇవ్వమని కోరారు. పాఠశాల నుండి వచ్చిన తర్వాత లాస్య తీవ్ర మనస్థాపానికి గురైంది. అదేరోజు తల్లిదండ్రులు నిద్రించగా మధ్యరాత్రి 17వ అంతస్తు నుండి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విద్యార్థిని పైనుంచి పడడంతో శరీర భాగాలు రెండు ముక్కలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కెసిఆర్‌లా మోసం చేయడం లేదు

### ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** గతంలో కెసిఆర్ ప్రభుత్వం లాగా మేము మోసం చేయడం లేదు, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రజా పాలనాలో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రజలతో ముఖాముఖీ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై వినతులు స్వీకరించి సంబం ధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్ళానని తెలిపారు. నా నియోజకవర్గంలో కూడా పల్లె బాట కార్యక్రమం మొదలు పెట్టానని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకునేలా ఇప్పటికే 20 గ్రామాలు తిరిగానని వివరించారు. రాజకీయ ఎత్తులు, జిత్తులు అట్లాంటివి పట్టించుకోనని ఆమె తెలిపారు. నా టార్గెట్ మొత్తం ప్రజలకు మేలు చేయా లనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నా అని అన్నారు. పాలకుర్తి కోడల్నీ, ఆడపడుచురాలిని ప్రజలకు ఎల్లవేళలా సేవ చేయడమే నా టార్గెట్. విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు.



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ పిసిసి చీఫ్ విహెచ్

## బిసి రిజర్వేషన్‌తో ముస్లింలకు లబ్ధి ప్రచారం పచ్చిఅబద్ధం

### ఢిల్లీలో ఆగస్టు 5 నుంచి 7 వరకు జరిగే ధర్నాకు ముఖ్యమంత్రి రేవంత్ హాజరు

### పిసిసి మాజీ చీఫ్ హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ తో ముస్లింలకు మాత్రమే లబ్ది అనేది పచ్చి అబద్ధమని మాజీ పిసిసి చీఫ్, మాజీ ఎంపి హనుమంతరావు అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇంకెంతకాలం ఇందిర పార్క్ వద్ద ధర్నాలు, ప్రెస్ మీట్‌లు తాడోపేడో తేల్చుకొనేందుకు డిల్లీకి వెళ్దాం రండి అని బిసి సంఘాల నేతలను కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలకు పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా జంతర్ మంతర్ వద్ద బిసి ధర్నా జరగాలి. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తీసుకుందాం ఇప్పుడు విస్మరిస్తే ఎప్పటికీ కాదు.

ఈ అదృష్టాన్ని బీసీలు చేతులారా చెడగొట్టు కోవద్దు అందుకే అందరం కలసి పోరాటం చేయాలి. దేశ వ్యాప్తంగా బిసి రిజర్వేషన్ నినాదం కావాలి తెలంగాణలో 42శాతం రిజర్వేషన్ ఎట్లాగైనా అమలు అవుతుంది. ఈ నెల 5,6,7 తేదీలలో బిసి రిజర్వేషన్ కోసం డిల్లీలో పోరాటం చేస్తున్నామని ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఆ ధర్నాలో పాల్గొంటారు.

## భూపాలపల్లి బైపాస్‌రోడ్డు వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు

### కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరిన వరంగల్ ఎంపి కడియం కావ్య

### త్వరలో డిపిఆర్‌ను తయారుచేసి టెండర్ పనులు పూర్తి



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న వరంగల్ ఎంపి కడియం కావ్య

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పలు మార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరడంతో ఎట్టకేలకు నిధులు మంజూరు చేశారు. భూపాల పల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్ యాక్టివిటీల వల్ల ఎన్ హెచ్ 353సి మీద తీవ్ర వాహన రద్దీ పెరగడంతో పట్టణమధ్యలో ప్రమాదాలు పెరిగి పోతున్నాయని ఎంపి కావ్య కేంద్ర మంత్రికి వివరించారు. గత మూడు సంవ త్సరాల్లో 576 రోడ్డు ప్రమాదాలు జరగడంతో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించ డానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే ప్రత్యేక బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ నున్న బైపాస్ రోడ్డులో, రూ.175 కోట్లు నిర్మాణ పనులకు, రూ.75 కోట్లు భూసేకరణకు విని యోగించలని ఈ నిధులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు ఇస్తామని తెలియజేసారు. అందుకు సంబంధించిన డిపిఆర్ ను తయారు చేసి టెండర్ పనులు పూర్తి చేస్తామని వివరణాత్మక లేఖ ద్వారా కేంద్ర మంత్రి... వరంగల్ ఎంపీ కడియం కావ్యకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణ ప్రజల ఎన్నో యేళ్ల సమస్య తీరనుందని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య, ప్రజల భద్రతో పాటు ప్రయాణ దూరంలో లాభం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్

### మొదటిరోజు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 93 శాతం హాజరు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి శుక్రవారం నుంచి పేస్ రికగ్నేషన్ అటెండెన్స్(ముఖ గుర్తింపు హాజరు) ప్రారంభమైంది. ఇప్పటికే దీనిని గత ఏడాది డిసెంబర్‌లో పైలట్ ప్రాజెక్టుగా పెద్దపల్లి జిల్లాలో ప్రారం భించగా.. ఆగస్టు 1(శుక్రవారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. ఆగస్టు 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ గుర్తింపు హాజరును ప్రారంభించినట్టు పాఠశాల విద్య శాఖ అధికారులు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ తన పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులతోపాటు బోధనేతర సిబ్బందికి శుక్రవారం నుండి ముఖ గుర్తింపు హాజరును అమల్లోకి తీసుకొచ్చిందని అధికారులు స్పష్టం చేశారు.

విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 24973 ఉండగా .. అందులో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిపి 1,28,760 మంది ఉన్నారని తెలిపారు. వారిలో శుక్రవారం ముఖము గుర్తింపు హాజరు ఆప్ ద్వారా 96,327 (75శాతం) మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 89,922 (93.3శాతం) మంది తమ హాజరును ముఖ గుర్తింపు హాజరు యాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందని అధికారులు ప్రకటించారు.

## అనుముల అన్నదమ్ముల కోసమే ఫార్మా భూముల్లో ఫ్యూచర్ సిటీ: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 1:** కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అన్న నిజం ఫార్మా సిటీ భూముల వ్యవహారంతో మరోసారి తెలిసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. అధికారం ఉందన్న అహంకారంతో ప్రజల అనుమతి లేకుండా భూముల సర్వే జరపాలనుకోవడం ఫాసిస్టు చర్య అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మా భూములు మాగ్గావాలె అని మర్లవడ్డ రైతులపై అక్రమ కేసులు పెడుతున్న రేవంత్ రాక్షసత్వాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫార్మా రైతులను నిలువునా ముంచి అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీని రేవంత్‌రెడ్డి నిర్మిస్తు న్నారని కెటిఆర్ విమర్శించారు. అడుగడుగునా అన్నదాతలు మర్లవడుతున్నా, ఏకంగా ఎంఎల్‌ఎల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌కి బుద్ధి రావడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చట్టప్రకారం భూములను తిరిగి పొందే హక్కు ఉన్న రైతులతో ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు.

ఓవైపు ఫార్మా సిటీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రేవంత్ ప్రభుత్వం, అటు ప్రజలను, ఇటు న్యాయ స్థానా లను మోసం చేసిందని అన్నారు. ఫార్మా సిటీ రద్దయితే తమ భూములు తిరిగి వస్తాయని ఆశ పడ్డ రైతుల నోట్లో మట్టికొడుతున్న రేవంత్ రెడ్డికి కర్రుగాల్చి వాతపెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారని కెటిఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది.

లగచర్ల గిరిజన రైతుల భూములు, కంచె గచ్చిబౌలి అటవీ భూములు, అనుముల బ్రదర్స్ కోసం ఇప్పుడు ఫార్మాసిటీ అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా.. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందని కెటిఆర్ అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వడం, యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించడం, ప్రశ్నించిన వారిని వేధించడం, సిగ్గులేకుండా భూ కబ్జాలు చేయడమే మూల స్తంభాలుగా రేవంత్ ప్రభుత్వ పాలన నడుస్తుందని మండిపడ్డారు. అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్ నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కు తింటున్నాయని చెప్పారు. దోస్తులకు దోచి పెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భూములు తిరిగి ఇచ్చేవరకు రైతుల పక్షాన బిఆర్ఎస్ ఉద్యమిస్తుందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## అడ్వాన్స్ పేమెంట్.. 'డిస్కౌంట్ల్' మోసం

### నిజామాబాద్ జిల్లాలో ఓ ఫర్నిచర్ దుకాణం నిర్వాకం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఉత్పత్తుల విక్రయాల్లో ఎన్నో రకాల మోసాలు వెలుగుచూస్తున్నాయి. జిమిక్కులతో అమాయకులను బురిడీ కొట్టించి లాభపడుతున్నారు. అయితే ఇలాంటి మోసమే శుక్రవారం నిజా మాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. ఆర్మూర్‌టౌన్ నిజాంసాగర్ కెనాల్ పక్కన జిరాయత్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ఓ ఫర్నిచర్ దుకాణం ఉంది. అడ్వా న్స్ పేమెంట్ చేసిన వారికి ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్ తదితర గృహోపకరణాలు 40 శాతం డిస్కౌంట్ అని బ్యానర్లు, కరపత్రాలతో కొంతకాలంగా ప్రచారం చేశారు. దీంతో ఆకర్షితులైన ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి డబ్బులు చెల్లించి ఆర్డర్ చేశారు. డెలివరీ తేది వచ్చిన సామాగ్రి రాకపోవడంతో కస్టమర్లు గందరగోళంలో పడ్డారు. దీంతో దుకాణం వద్దకు వచ్చేసరికి తాళం వేసి ఉంది. ఓనర్‌కు ఫోన్ చేసిన స్విచ్ఛాఫ్ ఉంది. రోజులు గడిచిన షాప్ తెరవక పోవడంతో బాధితులందరు కలిసి ఆర్మూర్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన్నట్లు సిఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

## ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన బిఆర్ఎస్

### ఉపఎన్నికలు వస్తాయని హరీశ్, కెటిఆర్ కొత్తనాటకం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన చరిత్ర బిఆర్ ఎస్ పార్టీదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. శుక్రవారం విలేఖరులతో సిఎల్పిలో మాట్లాడుతూ కాంగ్రెస్, టిడిపి, వై ఎస్ ఆర్ సిపి, బిఎస్‌పి చివరికి కమ్యూనిస్ట్ పార్టీ ఎంఎల్ ఏ లను బెదిరించి, ప్రలోభ పెట్టి అవినీతి డబ్బు తో కొనుగోలు చేసిన నీచులు బిఆర్ఎస్ నేతలు అని మండిపడ్డారు. కెటిఆర్, హరీష్ రావు రాష్ట్రం లో కొత్త డ్రామాకు తెర తీశారని విమర్శించారు ఉప ఎన్నికలు వస్తాయి అని అంటున్నారు రాష్ట్రంలో ఉపఎన్నికలు రావు బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల లో 60 మంది ప్రతిపక్ష ఎంఎల్‌ఏ లను కొనుగోలు చేసిన నీచచరిత్ర కెసిఆర్ ది.. అప్పుడు రాని ఉపఎన్నికలు ఇప్పుడు ఎలా వస్తాయి? అని మేడిపల్లి సత్యం సందేహం వ్యక్తంచేశారు. పార్టీ పిరాయింపు లకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ ఎస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత ఆపార్టీకు లేదని అన్నారు. మీరు చేసిన ఫిరాయింపుల పైన ముందు కెసిఆర్ ముక్కు నేలకు రాసి మరీ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఒక వేళ ఉప ఎన్నికలు వచ్చినా అన్ని సీట్లు మేమే గెలుస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ లు పోయినట్లు ఉప ఎన్నికలు వస్తే బిఆర్ ఎస్‌కు అదే జరుగుతుంది. మా సిఎం రేవంత్ రెడ్డి గేట్లు ఓపెన్ చేస్తే మీ కుటుంబం లోని ముగ్గురు నలుగురు తప్ప ఎవరూ బిఆర్ఎస్‌లో మిగలరని అన్నారు.

## పటిష్ట మేధోసంపత్తి హక్కులతో రైతుల ఆవిష్కరణలను కాపాడుకోవాలి

### తెలంగాణ ఉద్యాన వర్సిటీ విసి డాక్టర్ దండా రాజిరెడ్డి

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 1, ప్రభాతవార్త:** రైతుల ఆవిష్కరణలను బల మైన మేధోసంపత్తి హక్కులతో కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. నెలకు కనీసం ఒక పేటెంట్ దాఖలు చేయాలని విశ్వ విద్యాలయం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులను కోరారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ (టిజిసిఓఎస్‌టి), తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐపిఆర్ విభాగం సంయుక్తంగా 'ఉద్యాన రంగంలో ఆవిష్కరణలు, మేధో సంపత్తి హక్కుల'పై జాతీయ వర్క్‌షాప్‌కు శుక్రవారం రాజేంద్రనగర్ లోని కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌లో జరిగింది. భారత ప్రభుత్వ పర్యావరణం, అడవులు, సైన్స్ టెక్నాలజీ విభాగం, తెలంగాణ ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆర్థికంగా మద్దతు ఇస్తున్నాయి. వర్సిటీ ఆధ్వర్యంలో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపు భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ జరుగుతుందని ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. ఉద్యాన పురోగతి నైతిక రక్షణ లో మేధో సంపత్తి హక్కులు ప్రధాన పాత్ర వహిస్తాయని సైన్స్, చట్టం, సమాజ జ్ఞానాన్ని అనుసం ధానించడానికి పేటెంట్లని మరింతగా ప్రోత్స హించాలని ఆయన తెలిపారు. విశ్వ విద్యా లయం పరిధిలోని పరిశోధకులు, విద్యార్థుల పేటెంట్‌యోగ్యమైన ఆవిష్కర ణలకు ఆర్థిక సహాయాన్ని వర్సిటీ అందిస్తుందని ప్రకటించారు. ఆవిష్కం ణలను రక్షించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. దీనివల్ల రైతులకు సాధికారత లభిస్తుందనిఖి అని డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఐపీ రిజల్యూట్ గ్రూప్ లీగల్, ఐపీఆర్ హెడ్ శుభజిత్ సాహా పేటెంట్లు, భౌగోళిక సూచికలు, ఉద్యాన రంగంలో వాటి ప్రయోజ నాలపై జాతీయ సదస్సులో కీలకోప న్యాసం చేశారు. భారతదేశంలో విజయవంతమైన భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ పంటలు, ఉత్పత్తుల కేస్ స్టడీలను ఆయన వివరించారు. మేధోమదన ఆధా రిత రక్షణ విధానాలు, గ్రామీణ ఆర్థిక అభ్యున్నతి, జీవ వైవిధ్య పరిరక్షణ, సాంప్రదాయ పంటలకు బ్రాండ్ గుర్తింపునకు ఎలా దోహదపడతాయో వివరించారు.

## మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

### ప్రభుత్వానికి పండితుల అసోసియేషన్ల విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండి తులకు పదోన్నతులు కల్పించాలని భాషా పండితుల అసోసియేషన్స్ డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాల విద్య శాఖ రాష్ట్రం లోని ఉపాధ్యాయులకు పదోన్నతుల కోసం షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో గతంలో భాషా పండితుల నుంచి స్కూల్ అసిస్టెంట్స్‌గా ఉన్నతీకరించగా.. వారిలో మిగిలిపోయిన మరో 1000 మందికి పదోన్నతులు కల్పించాలని సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించినందుకు ప్రభుత్వానికి స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్‌ఎల్‌టిఏ) తెలంగాణ కృతజ్ఞతలు తెలిపింది. 2024లో పదోన్నతి పొందలేక మిగిలిపోయిన భాషా పండితులందరికీ పదోన్నతి కల్పించాలని ఎస్ఎల్‌టిఏ టిజి రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గౌరీ శంకర్ రావు డిమాండ్ చేశారు. మిగిలిన సబ్జెక్ట్స్ పరంగా కొన్ని సమస్యలు తలెత్తినా, మనోవేదనకు గురయ్యే భాషా పండితులకు మాత్రం తక్షణమే పదోన్నతి కల్పించాలన్నారు. విభజనకు ముందున్న జిల్లా కేంద్రాల్లో ఏర్పడ్డ ఇబ్బందులను సరిచూసి మిగిలిపోయిన భాషా పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు వివిధ

స్థాయిలలో పదోన్నతులకు పచ్చజెండా ఊపుతూ షెడ్యూల్ విడుదల చేయడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యుపిపి టిజి) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 1000 మంది భాషాపండితుల పోస్టుల ఉన్నతీకరణకు సంబంధించిన ఫైల్‌ను త్వరగా పరిష్కరించి.

మిగిలిన షేర్‌హోల్డర్‌ల యొక్క గమనిక నిమిత్తం ఎగ్జిట్ ఆఫర్
స్కూటర్స్ ఇండియా లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వ సంస్థ), కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : L25111UP1972GOI003599
నమోదిత కార్యాలయం : 3/481, 1వ అంతస్తు, వికల్పఖండ్, గోమ్తీ నగర్, లక్నో, ఉత్తర ప్రదేశ్, ఇండియా-226010: ఫోన్ నం: 0522-3119593
వెబ్‌సైట్ : www.scootersindialimited.com, ఇ-మెయిల్ ID : csscootersindia@gmail.com
www.scootersindialimited.com www.skylinerta.com www.corporateprofessionals.com
ప్రదేశం : లక్నో
తేదీ : ఆగస్టు 02, 2025
ఎక్విటీ తరఫున మరియు కొరకు
సం/- నవీన్ కౌల్
(అధీకృత సంతకందారు)

# తెర

## సైంటిఫిక్ సెన్సేషన్ థ్రిల్లర్ 'మాతృ'



హీరో శ్రీరామ్ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'మాతృ ఇందులో సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు అలీ, ఆమనీ, రవి కాలే, పృథ్వీ రాజ్, దేవి ప్రసాద్, నందినీ రాయ్ ముఖ్య భూమికలు పోషించారు ఈ చిత్రాన్ని శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్ పై బూర్లె శివ ప్రసాద్ ప్రతిష్ఠాతకంగా నిర్మించారు. సైంటిఫిక్ త్రిల్లర్ కథనం తో దర్శకుడు జాన్ జాక్కి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మాతృ చిత్రం ఆగస్ట్ 8 న మీ అభిమాన థియేటర్ లో ప్రదర్శింపబడుతుంది ఈ చిత్రం లోని సంగీతంకు ఆదిత్య మ్యూజిక్ లో మంచి వచ్చింది. నిర్మాత బి. శివప్రసాద్ మాట్లాడుతూ మా బ్యానర్ లో నిర్మించిన మాత్రు సినిమాను ఈ నెల 8వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ థియేటర్స్ లో గ్రాండ్ గా రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నాం. ఒక డిఫరెంట్ సైంటిఫిక్ థ్రిల్లర్ మూవీగా మాత్రు మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన మా సినిమా కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ ఆకర్షణగా నిలుస్తుంది. సినిమాకు కూడా థియేటర్స్ లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం మని అన్నారు.

## మెహర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బన్ బటర్ జామ్' టీజర్..

ఆగస్ట్ 8న మూవీ గ్రాండ్ రిలీజ్ రాజు జెయమోహన్, ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరో హీరోయిన్లుగా రాఘవ్ మిర్దత్ దర్శకత్వంలో.. సురేష్‌సుబ్రమణియన్ సమర్పకుడిగా రెయిన్ ఆఫ్ ఎరోస్, సురేష్ సుబ్రమణియన్ నిర్మించిన ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనం 'బన్ బటర్ జామ్' ఔట్ అండ్ ఔట్ కామెడీగా తమిళం లో రిలీజ్ అయ్యి సూపర్ హిట్ అయ్యింది. ఈ మూవీని తెలుగులో ఆగస్టు 8న శ్రీ విఘ్నేశ్వర ఎంటైన్మెంట్స్ బ్యానర్ పైన సిహెచ్ సతీష్ కుమార్ ఆగస్ట్ 8న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.



ఈ నేపథ్యంలో గురువారం టీజర్‌ను టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్ విడుదల చేసి సినిమా పెద్ద సక్సెస్ కావాలని చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. 'బన్ బటర్ జామ్' టీజర్‌ను గమనిస్తే తల్లిదండ్రులైన చార్లి, శరణ్య పొన్ వనన్ తమ కొడుకు గొప్పతనం గురించి మరొకరితో ఫోన్‌లో చెబుతుంటారు. మరో వైపు హీరో క్యారెక్టర్‌ను ఫన్నీగా ప్రజెంట్ చేశారు. అలాగే హీరో, హీరోయిన్ మధ్య లవ్ ట్రాక్‌ను కూడా ఎంటర్‌టైనింగ్ వేలోనే చూపించటం కొస మెరుపు. సునిశితమైన ఎమోషన్, అన్‌స్టాపబుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టమవుతోంది. రాఘవ్ మిర్దత్ ఫన్నీగా సినిమాను తెరకెక్కించిన తీరు, నివాస్ కె.ప్రసన్న సంగీతం, బాబు కుమార్ సినిమాటోగ్రఫీతో పాటు ప్రొడక్షన్ వేల్యూస్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఆగస్ట్ 8న రిలీజ్ కాబోతున్న ఈ సినిమాను తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సి.హెచ్.సతీష్ కుమార్ విడుదల చేస్తున్నారు. నటీనటులు: రాజు జెయమోహన్, ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ, చార్లి, శరణ్య పొన్‌వన్నన్, దేవదర్శిన, మైకేల్ తంగదురై, విజె.పప్పు తదితరులు. సాంకేతిక వర్గం: రచన, దర్శకత్వం: రాఘవ్ మిర్దత్, నిర్మాతలు: రెయిన్ ఆఫ్ ఎరోస్, సురేష్ సుబ్రమణియన్, సంగీతం: నివాస్ కె.ప్రసన్న, సినిమాటోగ్రఫీ: బాబు కుమార్, ఎడిటర్: జాన్ అబ్రహం, వి.ఎఫ్.ఎక్స్ ప్రొడ్యూసర్: స్టాలిన్ శరవణన్ఆర్ట్: శశికుమార్, ప్రాజెక్ట్ డిజైనర్: సతీష్ కె, కొరియోగ్రఫీ: బాబి, స్టంట్: ఓం ప్రకాష్, సౌండ్ డిజైన్: సింక్ సినిమా, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: ఎం.జె.భారతి, పి.ఆర్.ఓ: నాయుడు సురేంద్రకుమార్, ఫణి కందుకూరి బియాండ్ మీడియా .

## 'వచ్చిన వాడు గౌతమ్' బర్త్ డే పోస్టర్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి మామిడాల ఎం .ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్‌నెంబర్ 3గా రూపొందు తున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో ప్రొడ్యూసర్.



ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇంటెన్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది.

ఇటివలే భారీ బడ్జెట్‌తో హైవోల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీని వాడి ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశారు. నిర్మాత గణపతి రెడ్డి ఎలాంటి రాజీ లేకుండా, పెద్ద చిత్రాలకు ఏమాత్రం తీసిపోని ప్రొడక్షన్ విలువలతో సినిమాను తెరకెక్కిస్తున్నారు.

రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీశర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, విటివి గణేష్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ. ఆయన విజువల్ ప్రెజెంటేషన్ ఈ క్లైమాక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. చిత్రానికి గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. వర్మా ఎడిటర్.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు. నటీనటులు: అశ్విన్ బాబు, రియా సుమన్, అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, విటివి గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ, అభిత్ భూషణ్, నాగి, అభినయ, సాయి రోనక్, విద్యుల్లేఖ. సాంకేతిక నిపుణులు :

స్టోరీ – స్క్రీన్ ప్లే – డైరెక్షన్ : మామిడాల ఎం. ఆర్. కృష్ణ నిర్మాత :టి. గణపతి రెడ్డి
కో ప్రొడ్యూసర్ : ప్రవల్లిక యోగిలైన్ ప్రొడ్యూసర్ :టి. బద్రి నాథ్ రెడ్డి
బ్యానర్ : అరుణ శ్రీ ఎంటర్టైన్మెంట్స్‌డీవోపీ : ఎం. ఎన్ బాల్ రెడ్డి,
మ్యూజిక్ : గౌరహరిఎడిటింగ్ : ఎమ్.ఆర్. వర్మా ఫైట్స్ : పృథ్వి, రామకృష్ణ ఆర్ట్ : సురేష్ భీమగని
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎ.దుర్గేష్‌కో – డైరెక్టర్ : యు. కృష్ణ కిషోర్ పబ్లిసిటీ డిజైన్: అనిల్ భాను
పీఆర్వో : తేజస్వి సజ్జా.

# ఆగస్టులో కొత్త చిత్రాల వెల్లువ..



ఆ 2 సినిమాలే మేజర్‌గా ఈ మధ్య కాలంలో సరిగ్గా సినిమాలు పెద్దగా రావడం లేదనే కంప్లైంట్స్ మూవీ లవర్స్ లో ఉన్నాయి. జూలైలో ఒక్క హరిహర వీరమల్లు నోటెడ్ గా కనిపించింది. దాని తర్వాత కింగ్డమ్. ఇక నెక్స్ట్ ఆగస్ట్ ఇపుడు రానే వచ్చింది. ఈ రావడంతోనే నెలాఖరు వరకు పాన్ ఇండియా లెవెల్లో మంచి స్టార్ కాస్ట్ తో కూడిన సినిమాలే లైన్ లో వేచి ఉన్నాయి. వీటితో పాటుగా పలు రీరిలీజ్ లు కూడా అవన్నీ ఏంటో డేట్స్ వారీగా చూద్దాం.

**సర్ మేడమ్ – ఆగస్టు 1**

మక్కల్ విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మెయిన్ లీడ్ లో నటించిన తమిళ చిత్రం 'తలైవన్ తలైవ్ఢి గత వారమే తమిళ్ లో విడుదల అయ్యింది. తెలుగులో కూడా అప్పుడే విడుదల కావాల్సి ఉంది కానీ ఆగింది. ఇప్పుడు తెలుగులో 'సర్ మేడమ్'గా విడుదల అయ్యింది.

**సన్ ఆఫ్ సర్దార్ 2 – ఆగస్టు 1**

బాలీవుడ్ స్టార్ నటుడు అజయ్ దేవగన్ మన తెలుగు సూపర్ హిట్ మర్యాద రామన్నకు రీమేక్ గా చేసిన సన్నాఫ్ సర్దార్ కి సీక్వెల్ ఇది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమా నేడు థియేటర్స్ లో హిందీలో విడుదల అయ్యింది.

**ధడక్ 2 – ఆగస్టు 1**

'సన్ ఆఫ్ సర్దార్ 2 తో పాటు విడుదల అవుతున్న ఈ యువ ప్రేమకథ, తమిళ చిత్రం 'పరియేరుమ్ పెరుమాళ్'కు హిందీ రీమేక్. అనిమల్ ఫేమ్ త్రిప్తి డిమ్రి, అలాగే యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటించిన ఈ చిత్రానికి షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించారు.

బకాసుర రెస్టారెంట్ – ఆగస్టు 8

నటుడు ప్రవీణ్ హీరోగా మారి చేసిన ఈ ఫుడ్ జానర్ సినిమా బకాసుర రెస్టారెంట్ ఆగస్ట్ 8న విడుదల కాబోతుంది.

**అతడు – రీరిలీజ్ – ఆగస్టు 9**

సూపర్ స్టార్ మహేష్ బాబు బర్త్ డే కానుకగా మేకర్స్ ఈ సినిమాని రీరిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ లలో మహేష్ కి మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఇది మరిన్ని రికార్డులు సాధిస్తుంది అని అభిమానులు నమ్ముతున్నారు. త్రివిక్రమ్ తెరకెక్కించిన సినిమాకి మణిశర్మ సంగీతం అందించారు.

**కూలీ – ఆగస్టు 14**

సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ'తో వస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో స్టార్ నటులతో వస్తున్న ఈ సినిమా స్వాతంత్ర దినోత్సవం కానుకగా ముందే విడుదల కాబోతుంది. వార్ 2 – ఆగస్టు 14

ఇక ఇదే డేట్ లో బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, కియారా అద్వానీ అలాగే జూనియర్ ఎన్టీఆర్ లతో అయన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం వార్ 2. దీనిపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా కూడా ఆరోజే బిగ్ స్క్రీన్స్ ని హిట్ చేయనుంది.

**పరదా – ఆగస్టు 22**

ఇది ఒక స్ట్రెయిట్ తెలుగు సినిమా, ప్రదీప్ కాండ్రేగుల దర్శకత్వం వహించారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించగా, దర్శనా రాజేంద్రన్, సంగీత సహాయక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం మంచి ప్రమోషన్స్ ఈ సినిమా చేసుకుంటుంది.

**స్టాలిన్ రీరిలీజ్ – ఆగస్టు 22**

మెగాస్టార్ చిరంజీవి నటించిన పవర్ఫుల్ మెసేజ్ యాక్షన్ డ్రామా ఈ స్టాలిన్. దర్శకుడు ఏ ఆర్ మురుగదాస్ తెలుగులో చేసిన మొదటి సినిమా ఇదే కాగా మెగాస్టార్ పుట్టినరోజు కానుకగా రీరిలీజ్ కి రాబోతుంది. దీనిపై మంచి బజ్ ఉంది.

సుందరకాండ – ఆగస్టు 27 ఈ ఫీల్‌గుడ్ తెలుగు డ్రామాలో నారా రోహిత్ నటించగా, వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించారు. భావోద్వేగంగా కథనాన్ని ఆశించే ప్రేక్షకులను ఈ సినిమా ఆకట్టుకుంటుందని భావిస్తున్నారు.

హృదయపూర్వం – ఆగస్టు 28

బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో ఫామ్ లో ఉన్న మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నుంచి ఈ ఏడాదిలో వస్తున్న మూడో సినిమానే "హృదయపూర్వం. దీనికి సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించారు. ఇది మోహన్ లాల్ కి హ్యాట్రిక్ గా నిలుస్తుందో లేదో చూడాలి.

**రివాల్వర్ రీటా – ఆగస్టు 29**

స్టార్ నటి కీర్తి సురేష్ నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ సినిమానే ఈ 'రివాల్వర్ రీటా' ఎప్పుడో తెరకెక్కించిన ఈ ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమా ఆగస్టు ఆఖరుకి లాక్ అయ్యింది.

**పరం సుందరి – ఆగస్టు 29**

దేవర బ్యూటీ జాన్వీ కపూర్, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా కలయికలో తుషార్ జలోటా దర్శకత్వం వహించిన సినిమానే పరం సుందరి.. బ్లాక్ బస్టర్ ప్రొడక్షన్ హౌస్ మడాక్ ఫిల్మ్స్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా పట్ల కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇలా ఆగస్టు ఒకటో తారీఖు నుంచే ప్రతీ వారం మినిమమ్ ఒక్క నోటెడ్ సినిమా అయినా ఆడియెన్స్ ని పలకరించేందుకు సిద్ధంగా ఉంది. మరి వీటి ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి .

## చిరు బర్త్ డే రోజున డబుల్ ట్రీట్ ప్లాన్: అనిల్ రావిపూడి..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను అనిల్ తనదైన మార్క్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నాడు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి త్వరలోనే రెండు భారీ అప్డేట్స్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోందట.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌తో పాటు ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ త్వరలోనే చేయబోతున్నారట మేకర్స్. ఇక ఈ సినిమాలో చిరు పాత్ర అభిమానులకు ఫుల్ మీల్స్ పెట్టడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాలో స్టార్ బ్యూటీ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



## నార్త్‌లో మహావతార్ నరసింహా సెన్సేషన్..!



అసలు ఎలాంటి స్టార్ కాస్ట్ లేకుండా ఒక యానిమేషన్ సినిమా ఇపుడు పాన్ ఇండియా లెవెల్లో దుమ్ము లేపుతుంది. మరి ఆ చిత్రమే "మహావతార్ నరసింహా". దర్శకుడు అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమా ఒక ఊహించని బ్లాక్ బస్టర్ అని చెప్పాలి. తెలుగు, హిందీ భాషల్లో ఈ యానిమేషన్ సినిమా భారీ వసూళ్లు అందుకుంటుంది.

ఇక నార్త్ లో అయితే వీక్ డేస్ లోకి వచ్చినప్పటికీ అదే నిలకడతో దూసుకెళ్తుండడం విశేషం. సోమవారం నుంచి నిన్న గురువారం వరకు కూడా ఒకో రోజుకి గ్రాఫ్ పెరుగుతూనే వెళ్ళింది తప్పితే ఈ చిత్రం ఎక్కడా తగ్గింది లేదు. ఇలా 3.8 కోట్ల నెట్ వసూళ్ల నుంచి నిన్న గురువారానికి 5.9 కోట్ల నెట్ వసూళ్ల మార్క్ ని ఈ చిత్రం సొంతం చేసుకోవడం విశేషం.

దీనితో మొత్తం 32.8 కోట్ల నెట్ వసూళ్లు ఒక్క హిందీ వెర్షన్ లోనే ఈ సినిమా రాబట్టడం అనేది సెన్సేషన్ అని చెప్పాలి. ఇక వీక్ డేస్ లోనే ఇలా ఉంటే నేడు రేపు వీకెండ్ హాలిడేస్ ఏ లెవెల్లో ఉంటాయో కూడా అర్థం చేసుకోవచ్చు. సో ఈ రెండు రోజుల్లో ఈ చిత్రం ఎలాంటి వసూళ్లు రాబడుతుంది అనేది వేచి చూడాలి.

## ఒటిటికి వచ్చిన లేటెస్ట్ మూవీ '3 బిహెచ్‌కె'

తమిళ సహా తెలుగు ఆడియెన్స్‌కి బాగా దగ్గరైన కోలీవుడ్ హీరోస్ లో టాలెంటెడ్ నటుడు సిద్ధార్థ్ కూడా ఒకరు.

మరి సిద్ధార్థ్ నటించిన రీసెంట్ చిత్రమే చి3 బి హెచ్ కె". దర్శకుడు సాయి గణేష్ తెరకెక్కించిన ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా డీసెంట్ రన్ అందుకుంది.

నటుడు శరత్ కుమార్, దేవయాని, చైత్ర జె ఆచార్ తదితరులు నటించిన ఈ చిత్రం ఎట్టకేలకి ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది.

మరి ఈ చిత్రం కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వారు నేటి నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేసారు. ఇందులో నేటి నుంచి తమిళ్ సహా తెలుగులో ఈ చిత్రం అందుబాటులోకి వచ్చింది. మరి అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునే వారు ఈ చిత్రాన్ని చూడొచ్చు. ఇక ఈ సినిమాకి అమృత్ రామ్ నాథ్ సంగీతం అందించగా అరుణ్ విశ్వ నిర్మాణం వహించారు.



## 'మిత్ర మండలి' నుంచి మరో సరదా గీతం



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్తఅశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భానుప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్. ఎం. తెలుగుతెరకు పరిచయ మవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, 'కత్తందుకో జానకి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా స్వేచ్ఛ స్టాండు. విడుదలైంది. 'మిత్ర మండలి' నుంచి మొదటి గీతంగా విడుదలైన 'కత్తందుకో జానకి' అందరూ సరదాగా పాడుకునేలా ఉండి, సోషల్ మీడియాలో ఒక ఊపు ఊపింది. ఇప్పుడు రెండవ గీతంగా వచ్చిన 'స్వేచ్ఛ స్టాండు' కూడా అంతే సరదాగా ఉంది. ఆర్.ఆర్. ధృవన్ స్వరపరిచిన ఈ పాటకు ఆర్.ఆర్. ధృవన్, విజయేందర్ ఎస్ సంయుక్తంగా సాహిత్యం అందించారు. తేలికైన ఇంగ్లీష్ పదాలతో సరదా సరదాగా ఈ గీత రచన ఉంది.. కథానాయిక దృష్టిలో పడటం కోసం కథానాయకులు వచ్చీరాని ఇంగ్లీష్ పదాలతో పాట పడటం భలే సరదాగా ఉంది. ముఖ్యంగా ఈ తరం శ్రోతలకు నచ్చేలాస్వేచ్ఛ స్టాండుగీతం సాగింది. వెన్నెలకిషోర్, సత్య, వి.టి.వి. గణేష్ ముఖ్యపాత్రలుపోషిస్తున్న ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందంపని చేస్తోంది. ఛాయా గ్రాహకుడిగా సిద్ధార్థ్ఎస్. జె, కళాదర్శకుడిగా గాంధీనడికుడికర్ వ్యవహరిస్తున్నారు .పీకేఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సహనిర్మాతగా సోమరాజుఎన్మెత్స, ఎగ్జిక్యూటివ్‌ప్రొడ్యూసర్‌గా రాజీవ్‌కుమార్‌రామా వ్యవహరి స్తున్నారు. టీజర్, 'కత్తందుకో జానకి' గీతం ఆకట్టుకొని 'మిత్ర మండలి' చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడేలా చేశాయి. థియేటర్లలో మనస్ఫూర్తిగానవ్వుకునేలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

ప్రేక్షకులకు సరికొత్తవినోదాన్ని అందించడానికి త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో అడుగుపెట్టనుంది.



## 'అరేబియా కడలి' లో ఆసక్తి రేపుతున్న సత్యదేవ్!

మత్స్యకారుల బతుకుపోరాటం: 'అరేబియా కడలి' ట్రైలర్తో ఆసక్తి రేపుతున్న సత్యదేవ్!

కొన్ని కథలు వినడానికే ఆసక్తిగా ఉంటాయి. మరికొన్ని తెరపై చూస్తే మనసును కదిలిస్తాయి. అలాంటి ఒక బలమైన కథతో వస్తున్నారు సత్యదేవ్! ఆయన నటించిన ప్రైమ్ వీడియో ఒరిజినల్ సిరీస్ ఖిఅరేబియా కడలిఖి ట్రైలర్ తాజాగా విడుదలై, సినీ ప్రియుల్లో చర్చకు దారితీసింది.

క్రిష్ జాగర్లమూడి సమర్పణలో, వి.వి. సూర్య కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్, సముద్రంలో చేపల వేటపైఆధారపడి జీవించే కొందరు మత్స్యకారుల హృదయవిదారక కథను ఆవిష్కరించనుంది. అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటి, విదేశీ గడ్డపై బందీలుగా మారిన వారి పోరాటం, బంధాలు, ఆశల గురించి ఈ సిరీస్ వివరంగా చూపించనుంది. ట్రైలర్లో కనిపించిన దృశ్యాలు, సంభాషణలు, నేపథ్య సంగీతం సిరీస్కు హైఇంటెన్సిటీ డ్రామాను అందిస్తున్నాయి. సత్యదేవ్ 'బద్రి' పాత్రలో, ఆనంది'గంగ' పాత్రలో ఒదిగిపోయినట్లున్నారు.

ఇతర నటులైన నజర్, రఘు బాబు వంటివారు కూడా సిరీస్కు మరింత బలం చేకూర్చారు. దర్శకుడు సూర్య కుమార్ మాట్లాడుతూ, 'ఇది కేవలం బ్రతకడం గురించి కాదు, మనుషులు కష్టాల్లో ఎలా ఒకరికొకరు అండగా నిలబడతారో చూపిస్తుంద్హి అని చెప్పడం సిరీస్ థీమ్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తుంది. సత్యదేవ్ కూడా తన కెరీర్లోనే ఇదొక ఛాలెంజింగ్ రోల్ అని పేర్కొన్నారు

.సత్యదేవ్ తన పాత్ర గురించి మాట్లాడుతూ, ఇది తనకెరీర్లో అత్యంత తీవ్రమైన మరియు సంతృప్తినిచ్చిన ప్రయాణాలలో ఒకటి అని అన్నారు. కష్టాలు, త్యాగాల మధ్య చిక్కుకున్న ఒక పాత్రను పోషించడం చాలా సవాలుతో కూడుకున్నదని చెప్పారు. ఆనంది కూడా తన 'గంగ' పాత్ర గురించి మాట్లాడుతూ, అందులో చాలా ఎమోషన్స్ ఉన్నాయని, అన్యాయంపై పోరాడేమహిళగా నటించడం సంతృప్తి నిచ్చిందని తెలిపారు.

ట్రైలర్లో కనిపించిన నటీనటుల అద్భుతమైన నటన, నేపథ్య సంగీతం సిరీస్కు మరింత బలం చేకూర్చాయి.

## మదరాసినుంచి సెలవికకన్నమ్మా



శివకార్తికేయన్, అనిరుధ్ రవిచందర్, మురుగదాస్, శ్రీ లక్ష్మీ మూవీస్ 'మదరాసి' నుంచి లవ్ ఫెయిల్యూర్ యాంథమ్ సెలవిక కన్నమ్మా రిలీజ్ సెప్టెంబర్ 5న థియేటర్స్ లో రిలీజ్‌వెరీ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ ఇద్దరూ తొలిసారి కలిసి చేస్తున్న సినిమా మదరాసి. అద్భుతమైన థ్రిల్ తో పాటు మాస్ ఎంటర్టైనర్స్‌కి కొత్త డైమెన్షన్ ఇచ్చేలా ఈ సినిమా తెరకెక్కుతోంది. శ్రీ లక్ష్మీ మూవీస్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. టాలెంటెడ్ హీరోయిన్ రుక్మిణీ వసంత ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లిమ్స్ భారీ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.

ఈ చిత్రానికి రాకింగ్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు. ఫస్ట్ సింగిల్ సెలవిక కన్నమ్మా తో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. టీజర్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండగా, ఈ పాట మాత్రం వెరీ డిఫరెంట్ గా వుంది. లవ్ ఫెయిల్యూర్ సాంగ్ అయినప్పటికీ, డ్యాన్స్ తో ప్రజెంట్ చేయడం ఆకట్టుకుంది.

అనిరుధ్ కంపోజిషన్ డిఫరెంట్ వైబ్ ని క్రియేట్ చేసింది. శ్రీనివాస మౌళి లిరిక్స్ మరింతగా ఆకట్టుకున్నాయి. ధనుంజయ్ సీపాన వోకల్స్, గ్రూవీ మ్యూజిక్, శివకార్తికేయన్ ఎఫర్ట్‌లెస్ స్క్రీన్ ప్రెజెన్స్ – ఇవన్నీ కలసి బ్రేకప్ జెనరేషన్‌కి ఇది లవ్ ఫెయిల్యూర్ యాంథమ్ గామారిపోయింది. ఈ చిత్రంలో విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ సుదీప్ ఎలమోన్ అందిస్తున్నారు. మదరాసి సెప్టెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ కానుంది .

# చందనం చెట్లకు చిప్ కాపలా!




కలలు కని సాధించిన ఐటీ ఉద్యోగాన్ని... పెళ్లి తరవాత త్యాగం చేయాలంటే... నిరాశ ఆవరిస్తుంది. జీవితమే వృథా అయి పోతుందనిపిస్తుంది... ఇలానే ఆమె కూడా బాధపడ్డారు. కానీ, అందులోనే ఉండిపోలేదు. ఉన్నచోటే కొత్త అవకాశాలను సృష్టించారు. సమీకృత వ్యవసాయ విధానాలతో నష్టాల సాగుని లాభాల బాట పట్టించారు కర్ణాటకకు చెందిన కవితా మిశ్రా. గూర్చి తెలుసుకుందాం..

కాలమే జీవిత పాఠాలు నేర్పుతుందని నమ్ముతా. ఈ అధ్యయనం అనుభవపూర్వకంగానూ అర్థం చేసుకున్నా నా పాఠశాల చదువంతా ధార్వాడ్ సాగింది. హుబ్బళ్లిలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్, సైకాలజీలో మాస్టర్స్ చేశా. అప్పుడప్పుడే ఐటీ ఊపందుకుంటోంది. అవకాశాలు వచ్చాయి. నా లక్ష్యమూ ఆ కొలువే ఉద్యోగంలో చేరా. ఈలోగా రాయిచూర్కి చెందిన ఉమాశంకర్ మిశ్రాతో పెళ్లయ్యింది. తర్వాత జాబ్ కోసం అత్తారింట్లో ఒప్పుకోలేదు. ఇంట్లో ఖాళీగా ఉండటం నాకిష్టం లేదు. ఆ విషయాన్నే మా వారికి చెప్పా. ఆయన ఎనిమిదెకరాల పొలాన్ని అప్పజెప్పారు. మొదట కాదన్నా... ఆలోచిస్తే అది తప్ప మరే ప్రత్యామ్నాయం కనిపించలేదు. అయితే, అదేమో బంజరుభూమి. దాన్నేం అర్థం కాలేదు. మొదట భూమి చదివాను, నీళ్లకోసం బోరు వేయించినా అది పెద్ద ధారలేదు. ఈ నీటిని నమ్ముకుని వరి సాగు చేయడం కష్టం. అందుకే, ఆ నేల, వాతావరణం గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవడం ఆరంభించా.

**నష్టాలు దాటి...** మొదట దానిమ్మ తోట వేశ. మంచి లాభాలు వచ్చాయి. కానీ, ఆ తర్వాత తెగుళ్లు సోకడంతో వంట పూర్తిగా దెబ్బతింది. ఒక పంటకే పరిమితమైతే ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతాయి. ఈ నష్టాలు చూసి అందరూ... ఎందుకింత శ్రమ అన్నారు. నా మనసు మాత్రం వెనకడుగు వేయడానికి ఒప్పుకోలేదు. కొంత పరిశోధన తర్వాత ఉద్యాన పంటలతోపాటూ ఆటవీ వ్యవసాయం (ఆగ్రో ఫారెస్ట్) సాగు చేయడం ఆరంభించా. ఈ ఆలోచన నాజీవితాన్నే మార్చేసింది. దీర్ఘకాల ప్రయోజనాల కోసం చందనం చెట్లు నాటా. వాటి మధ్యలో మామిడి, బత్తాయి, నిమ్మ, నేరేడు, జామ, మునగ, ఉసిరి, రేగు.. వంటి పండ్ల మొక్కలను వేశా. వీటితోపాటు రోజువారీ స్థిరమైన ఆదాయం కోసం ఆవులు, కోళ్లు, తేనెటీగల పెంపకం చేపట్టా. ఈ విధానం పెట్టుబడి వ్యవయం తగ్గి మంచి రాబడి పొందే అవకాశం కల్పించింది. అందుకే, నా అనుభవాలను ఇతర రైతులకూ పంచాలనుకున్నా. శిక్షణ, సలహాలు ఇవ్వడం ఆరంభించా. ముఖ్యంగా చందనం మొక్కల సాగు.. రైతులకు చేర్చాలని ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటుచేశా. ఆరంభంలో మా పొలంలో నాటిన 2500 చందనం మొక్కలు ఇప్పుడు పెరిగి పెదయ్యాయి. వీటి విలువ ప్రస్తుతం కోట్ల రూపాయలు. వీటిని దొంగతనం చేయకుండా ప్రతి చెట్టుకీ మైక్రోచిప్‌లను అమర్చా. గొడ్డలి వేటు పడితే చాలు వెంటనే ప్రకంపనలు వస్తాయి. స్మార్ట్‌ఫోన్‌కి అలర్ట్ వస్తుంది. మేం వెళ్లేలోగా దొంగలు వాటిని పట్టుకెళ్లినా జీపీఎస్‌తో ట్రాక్ చేయొచ్చు. డ్రోన్, సిసి కెమెరాలతో రక్షణ ఏర్పాటుచేశా. ఈ తరహాలో వినూత్నంగా సాగు చేయడంతో ఇన్నోవేటివ్ ఫార్మర్‌గా, అంత్రప్రెన్యూర్‌గా నాకో గుర్తింపు దక్కింది. తాజాగా మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాయలం గౌరవ డాక్టరేట్ అందించింది. □

# క్లిష్టమైన రేసులో ఆమె ఒక్కతే భారతీయురాలు




'డీప్ జపాన్ అల్ట్రా 100'.. ఆసియాలోనే క్లిష్టమైన అల్ట్రా మారథాన్ ట్రైల్ రేస్. మూడు పార్వతాలను చాటుకుంటూ గంటల పాటు నిద్ర లేకుండా 173 కిలోమీటర్ల దూరం పరిగెత్తాలి. ఈ విధమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోవాల్సి ఉంటుంది. అందుకే ఈ రేసులో పాల్గొనేవారు దాదాపు సగం మంది మధ్యలోనే ఆపేస్తుంటారు. కానీ, భారత్‌కు చెందిన **అశ్వినీ గణపతి (39)** విజయవంతంగా ఈ మారథాన్‌ను పూర్తి చేసింది. అంతేకాదు.. మొత్తం 10 మంది మహిళలు ఈ రేసుని పూర్తి చేయగా.. అశ్విని ఒక్కర్తే భారతీయురాలు కావడం విశేషం. ఈ నేపథ్యంలో అశ్విని ప్రయాణం గురించి తెలుసుకుందాం...

సరదాగా పాల్గొని.. కర్నాటకకు చెందిన అశ్వినికి చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ అంటే మక్కువ. పాఠశాల దశలోనే ఫీల్డ్ హాకీతో పాటు ఇతర క్రీడల్లో చరుగ్గా పాల్గొనడం. ఆ తర్వాత పూర్తిగా చదువుపై దృష్టి పెట్టిన నన్ను ఉన్నత విద్యను అభ్యసించి ఓ ఐటీ సంస్థలో కెరీర్ ప్రారంభించింది. ఈ కోరికనే పెళ్లి చేసుకున్న ఆమె అందరి లాగానే సాధారణ జీవితాన్ని గడిపింది. అయితే ఆమె పనిచేస్తోన్న సంస్థ '10కె రన్' ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. అందులో సరదాగా పాల్గొన్న అశ్విని పూర్తి దూరం పరిగెత్తినా అలసిపోలేదట. దాంతో తనలోని ఆసక్తిని తెలుసుకున్న అశ్విని... ఎక్కువ దూరం పరిగెత్తే మారథాన్లపై దృష్టి పెట్టింది. ఈ కోరికనే ఎండ్యూరెన్స్ అథ్లెట్‌గా మారాలనుకున్న ఆమె తొమ్మిదేళ్ల ఉద్యోగ ప్రయాణానికి స్వస్తి చెప్పింది.

**100 కిలోమీటర్లు...** ఉద్యోగ జీవితం నుంచి బయటకు వచ్చిన అశ్విని.. ఏడాది పాటు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌నూ పని చేసింది. ఆ తర్వాత అథ్లెట్‌గామారడం కోసం మొదట ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమలో తన జీవనశైలిని మార్చుకున్న ఆమె వారానికి 80 నుంచి 100 కిలోమీటర్లు రన్నింగ్ చేయడం మొదలు పెట్టింది. కండరాలు దృఢంగా ఉండడానికి వారానికి రెండుసార్లు స్ట్రెంత్ ట్రైనింగ్ కూడా చేయడం పారంభించింది.

**.. మారథాన్ల నుంచి అల్ట్రా మారథాన్ల వరకు......**

ఇలా తనను తాను సిద్ధం చేసుకున్న అశ్విని 2019లో 100 కిలోమీటర్లకు పైగా ఉండే 'మల్నాడ్ అల్ట్రా'లో మొదటిసారి పాల్గొంది. ఈ రేసులో 100 కిలోమీటర్లు పరుగెత్తినా తనలో ఇంకా శక్తి ఉండడంతో 160 కిలోమీటర్ల అల్ట్రా 100'ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆ తర్వాత వివిధ అల్ట్రా మారథాన్లలో పాల్గొన్న ఆమె.. పలు విజయాలను నమోదు చేసింది. 2022లో 'ఎవరెస్ట్ మారథాన్ (60కెఎం"లో పాల్గొంది. డీప్ జపాన్ అల్ట్రా 100కి సన్నద్ధతలో భాగంగా ఈ ఏడాది మేలో"బ్యాక్‌యార్డ్ అల్ట్రా'లో పాల్గొని 187 కిలోమీటర్ల దూరాన్ని 28 గంటల్లో పూర్తి చేసింది. ఈ రేస్ బెంగళూరులో జరిగింది.

**'డీప్ జపాన్ అల్ట్రా 100' అంటే...** ఈ రేసు 100 మైళ్ల దూరం ఉంటుంది. ఇందులో భాగంగా 9 వేల మీటర్ల ఎత్తులో ఉండే మూడు పర్వతాలను కూడా దాటాల్సి ఉంటుంది. మధ్యలో మొత్తం 14 చెక్ పాయింట్లు ఉంటాయి. వీటిని కూడా నిర్ణీత సమయంలో దాటాలి. విశ్రాంతి తీసుకోవడానికి కూడా సమయం ఉండదు. అక్కడక్కడ కొన్ని ఎయిడ్ స్టేషన్లు ఉంటాయి. కానీ, వాటదూరం కొన్ని సందర్భాల్లో 28కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ స్టేషన్లలో కొన్ని రకాల స్నాక్స్, డ్రింక్స్ అందిస్తారు. ఇంత క్లిష్టమైంది కాబట్టి చాలామంది రేసుని పూర్తి చేయకుండానే మధ్యలో వదిలేస్తుంటారు.

**...ఆమె ఒక్కర్తే....** ఇటీవల జరిగిన 'డీప్ జపాన్ అల్ట్రా 100' రేసులో పాల్గొనడమే కాకుండా విజయవంతంగా పూర్తి చేసింది అశ్విని. ఇందులో భాగంగా 173 సంవత్సరాల దూరాన్ని 45 గంటల 42 నిమిషాల్లో పూర్తి చేసి 60వ స్థానంలో నిలిచింది. ఈ రేసులో వివిధ దేశాల నుంచి మొత్తం 135 మంది పాల్గొనగా కేవలం 63 మంది మాత్రమే విజయవంతంగా పూర్తి చేయగలిగారు. ఇందులో 10 మంది మహిళలు ఉండగా అశ్విని ఒక్కర్తే భారతీయురాలు కావడం విశేషం. డీప్ జపాన్ అల్ట్రా 100' రేసుని 45 గంటల 42 నిమిషాల్లో పూర్తి చేశా. భద్రతా సామగ్రితో పాటు నీళ్లు, ఆహారం కలిపి సుమారు 8 కిలోల బరువును మోయాల్సి ఉంటుంది. శాఖాహారిని కావడంతో అక్కడి ఎయిడ్ స్టేషన్ల మీద ఆధారపడకుండా నా ఆహారాన్ని నేనే తీసుకెళ్లా. రెండు రాత్రులు నిద్ర లేకుంఆనే పరుగెత్తాను. మధ్యలో 5 నిమిషల పాటు కునుకు తీద్దామని ప్రయత్నించాను. కానీ, సాధ్యం కాలేదు. దాంతో మొత్తం సమయం పరుగుతోనే గడిచిపోయింది అంటు చెప్పుకొచ్చింది. అంతేకాదు.. తన విజయాలకు భర్త, అత్తమామలు అందించిన తోడ్పాటు సహకారమే కారణమంటోంది అశ్విని. □

# పాత పట్టుతో కొత్త అందాలు




ముచ్చటపడి వేసుకునే సంప్రదాయ దుస్తులేవని ఏ అమ్మాయినైనా అడగండి చీర, పరికిణీ ఓణీలు పేర్లే చెప్పేస్తారు. పట్టువైతే మరీ మరీ ఇష్టంగా వేసుకుంటారు. అమ్మ, బామ్మలనాటి చీరలను ముచ్చటపడి లంగా ఓణీగా కుట్టించుకుని మురిసిపోయేవారూ ఎక్కువే ఎంత ఇష్టమైతేనేం... వేసుకునేది మాత్రం అరుదుగానేగా! ఒకసారి వేషమంటే 'అరెరే మొన్నేగా ఫలానా ఫంక్షన్‌కి వేశా' మని పక్కన పెడతాం. కొన్నిసార్లు ఈ సందర్భానికి తగదంటూ లోపలే ఉంటాం. అందుకే ఎన్నేళ్లయినా అలా ఎదురుచూస్తూ బీరువాలో దాగి ఉంటాయవి. అలాంటి వాటికీ మోడరన్ టచ్ ఇస్తున్నారు బహుమతులు, పట్టుని లాంగ్ ఫ్రాక్‌లుగా తీసుకురావడం మనకు తెలిసిన సంప్రదాయ వస్త్రంగా అది కబోర్డులోనే దాగొద్దని కొత్త హంగులు అద్దేస్తున్నారు. లాంగ్‌కోనే రెండు మూడు రకాలుగా వేసుకునేలా చేస్తున్నారు. కోట్, లెహంగా, ఓణీలా మార్చుకునేలా రూపొందిస్తున్నారిలా. సందర్భాన్నిబట్టి డ్రెస్‌ని డిసైడ్ చేసుకోవచ్చున్నమాట. నిన్న, మొన్ననే చేసుకున్నామన్న సాకులూ అడ్డుకావు. చిన్న మాయతో డ్రెస్ రూపం మార్చేస్తూ వేసుకునే ఈ వీలు భలేగుంది కదూ! ఇంకేం మెచ్చిన పట్టును నచ్చిన రీతిలో డిజైన్ చేసుకోండి






# స్వీట్ రోటీ..



ఎప్పుడూ చేసే చపాతీలేనా అని ఇంట్లో ఎవరూ నాలుక చప్పరించకుండా ఇష్టంగా తినాలంటే చిన్న చిన్న ప్రయోగాలు చేయాలి. చపాతీ పిండితోనే స్వీట్ రోటీ చేయవచ్చు. అందుకోసం మైదాపిండి పావు కిలో, పంచదార పావు కప్పు, మగ్గిన అరటి పండ్లు రెండు, కాచి చల్లార్చిన పాలు రెండు టేబుల్ స్పూన్లు, నెయ్యి ముందుగా బాగా పండిన అరటిపండ్లను మెత్తగా గుజ్జులా చేసుకోవాలి. ఈ పిండిని చిన్న భాగాలుగా తీసుకుని.. కాస్త మందమైన రొట్టెలు చేసి పెనం మీద రెండువైపులా కాల్చుకోవాలి. సెలవు రోజుల్లో ఈ రోటీ చేస్తే..పిల్లలూ పెద్దలూ, అందరూ ఇష్టంగా తింటారు. వేడిగానే కాదు..చల్లారినా బాగుంటాయి కనుక ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి అనుకూలంగా ఉంటాయి. వీటికి సైడ్ డిష్ కూడా అవసరం లేదు. □

# పొన్నగంటి కూర ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది మొదట ఇండియా, శ్రీలంక నుండి ప్రపంచమంతటా పెరిగే ఉష్ణమండల జలమొక్క. ఇది అతి సులభంగా అతి తొందరగా అభివృద్ధి చెందే ఆకుకూర. ఇది గ్రామీణ ప్రాంతాల్లో తేమ, వేడి వాతావరణంలో చెరకు పొలాల్లో, చెరువుగట్లపై పెరిగే మొక్క. దీని రుచి బచ్చలి ఆకు మాదిరిగానే ఉంటుంది. ఇది శాఖోపశాఖలుగా నేలపై ప్రాకే ఔషద మొక్క. ఆకులు ఆకుపచ్చగా మందంగా, పొడవుగా, సన్నగా బాణం ఆకారంలో ఉండే దీన్ని మత్యాక్షి అని అంటారు. మంచి పోషకవిలువలున్న ఈ అద్భుత మొక్కని గ్రామీణులు తోటికూర అని అంటారు. దీని శాస్త్రీయనామం ఆల్టర్నేన్తెరా సెసిలిస్. ఇది అమరఆంథేసి ఫ్యామిలీకి చెందినది. ఇది నీటి తడిలో సంవత్సరం పొడవునా పెరగడం వల్ల దీన్ని వాటర్ అమరాంథస్ అని అంటారు. దీని ప్రత్యేకత ఏమిటంటే దీనికి విత్తనాలుండవు. కాండం ద్వారానే అభివృద్ధి చెందుతుంది. తెల్లని చిన్నపూలు ముద్దగా ఉంటాయి. పోన్ అంటే బంగారం అని అర్థం పొన్నగంటికూరని వరుసగా 48 రోజులు వాడితే శరీరం బంగారు ఛాయతో మెరిసిపోతుందని ఆయుర్వేదంలో చెపుతారు. అందుకే దీన్ని సామాన్యుడి బంగారు భస్మంగా పిలుస్తారు. తీపి, వగరు, చిరుచేదుగా ఉండి రుచిని పుట్టించే మృదువైన పొన్నగంటికూర వానాకాలంలోనే, ఎక్కువగా పెరుగుతుంది. ఇది పొడవుగా పెరగకుండా గుబురుగా కాండంతో పెరగడం వల్ల దీన్ని డ్వార్ఫ్ (మరుగుజ్జు) కాపర్ లీఫ్ అని అంటారు. దాదాపు 96 కంటివ్యాధుల్ని నయం చేసే మిరాకిల్ మొక్కగా తెలంగాణాలో పోయిన కంటికూర అని గ్రామీణనులు పిలుస్తారు. పురాతనకాలం నుండి జానపదుల గృహ ఔషధంగా ఆహారంగా ఉపయోగపడే పొన్నగంటికూరని బంగారు ఆకుకూర అని పిలుస్తారు. అంతేగాకుండా మచ్చేచి, పత్తుర, కొయిపా, గుడాంసాగ్, పొన్నాన్నన్నిక్కిరై, మీనన్నాని, పొన్నన్నాని, లోహమారక, శీతహర, సద్రిసాగ్, హోనుగొనె సొప్పు, పిస్సో స్పినాచ్, బ్రెజిలియన్ స్పినాచ్‌పానీకి భాజీ, బాష్లీ, లోనికా అని వివిధపేర్లతో, వివిధ ప్రాంతాల్లో పిలుస్తారు. **రకాలు :** పొన్నగంటి ఆకుకూర రెండు రకాలుగా లభ్యమవుతుంది. . **పచ్చపొన్నగంటికూర..** దీన్ని నాటు పొన్నగంటికూర అని అఒటారు. దీన్ని ఎక్కువగా వంటకాల్లో మందుల తయారీలో వాడుతారు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. **ఎర్ర పొన్నగంటికూర:** దీన్ని సీమ పొన్నగంటికూర పర్పూల్ ప్రిన్స్, లిటిల్ రూబీ అని అంటారు. దీన్ని విదేశాల్లో చిన్న ఆకులతో, ఎరుపుకాడలతో ఉండడం వల్ల పిలుస్తారు. దీన్ని తక్కువగా వాడుతారు. రెండింటిలోనూ పోషకాలున్నప్పటికి దీన్ని నెలాడ్స్‌లో ఉపయోగస్తారు.

**పోషకవిలువలు :** 100 గ్రాముల పొన్నగంటికూరలో ఉండే పోషకాలు : తేమ: 77%, కేలరీలు: 73 కె., ప్రోటీన్: 5గ్రా, కార్బోహైడ్రేట్స్ : 11.6 గ్రా. పీచు: 2.8 గ్రా, కాల్షియం : 510 మి.గ్రా. ఫాస్పరస్ : 60 మి.గా. ఐరనఖ్ 16.3 మి.గ్రా. బీటాకెరోటిన్ : 8,250 మి.గ్రా. నియాసిన్ : 1.2 మి.గ్రా. అధిక పోషక విలువలున్న పొన్నగంట కూర అనేక ఆరోగ్య ప్రయోజనాల్ని కల్గిస్తుంది.

**కన్ను :** కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేసేవారికి, వీడియోగేమ్స్, సెల్, టివిలు ఎక్కువగా చూసేవారికి, ఎండలో ఎక్కువగా తిరిగేవారికి, ఎండలో పనిచేసేవారికి, యు.వి.లైట్ ప్రభావాన్ని తగ్గించి అనేక కంటిసమస్యల్ని రాకుండా ఆరికడుతుంది. పిల్లల్లో రేచీకటి, దృష్టి లోపాలు రాకుండా కళ్ళజోడు అవసరం లేకుండా చేస్తుంది. □

# పొదుపుతోపాటు దాతృత్వం..



పిల్లలకిచ్చే మొత్తం పాకెట్‌మనీని సొంతంగా ఖర్చు పెట్టుకుంటున్నారా. అయితే ఈ కిడ్డీబ్యాంకులు కొనివ్వండి. ఇవైతే పొదుపుతోపాటు నలుగురికీ సాయపడటాన్నీ నేర్పిస్తాయి. బాల్యం నుంచే పొదుపు చేయడం నేర్పిస్తే భవిష్యత్తులో వారికి ఆర్థిక ప్రణాళిక అలవడుతుంది. చేతిలో ఉన్న దంతా ఖర్చు పెట్టకుండా, కొంతైనా పొదుపు చేయడంవల్ల అత్యవసరానికి ఉపయోగపడుతుందని అర్థమవుతుంది.

అలాగే తమవద్ద ఉన్న దాంట్లో కొంతైనా పేద పిల్లలకు, అనాథలకు అందించడం చిన్నప్పటి నుంచి పిల్లలకు అలవాటు చేస్తే వాళ్లలో దయాగుణం పెరుగుతుంది. ఈ లక్షణాలు పిల్లలకు రావాలంటే ప్రత్యేకంగా వస్తున్న ఈ కిడ్డీ బ్యాంకులను అందించండి. వీటిని రకరకాల రంగుల్లో జంతువుల ఆకారాల్లో పిల్లలను ఆకర్షించేలా తయారుచేస్తున్నారు. వీటిలో విడివిడిగా ఉన్న అరలపై పొదుపు, దానం, ఖర్చు అంటూ ప్రింట్ చేసి ఉంటుంది. వీటనిననంటిలోనూ తమ వద్ద ఉన్న నగదును సమానంగా వేయడం నేర్పితే చాలు. చిన్నారులకు క్రమేపీ ఇదొక అలవాటుగా మారుతుంది.

**ఖాళీ సీసాలతో..** ఇంట్లోనే... మార్కెట్‌లో దొరుకుతున్నవే కొనాలనేం లేదు. వీటిని ఇంట్లోనూ తయారుచేసి పిల్లలకు అందించొచ్చు. ఒకే ఆకారం, పరిమాణంలో ఉన్న మూడు ఖాళీ సీసాలు తీసుకొని సేవింగ్స్, టాయ్స్, డొనేషన్ అని రాసి వాటికి అంటించాలి. హోం మేడ్ కిడ్డీ బ్యాంకులు సిద్ధమవుతాయి. ఖాళీ పౌడర్, కూల్‌డ్రింక్ డబ్బాలకు స్టిక్కర్లు అంటించినా చాలు. వీటిని పిల్లలతోనూ సరదాగా సెలవురోజుల్లో తయారు చేయిం చొచ్చు. మరింకెందుకు ఆలస్యం? మీ బుజ్జాయిలకూ పొదుపు అలవాటు చేయండి. □




# నిమిత్తమాత్రులం!



అశ్ముడు అనే తపోదీక్షాపరుడు జనక మహారాజును దర్శించుకునేందుకు వచ్చాడు. మాటల సందర్భంలో విప్రోత్తమా మనమంతా శ్రేయస్సునే కోరుకుంటాం కదా! ఇంతకీ.. బంధువులు, సంపదలు లభించినప్పుడు ఎలా ఉండాలి? కోల్పోయినప్పుడు ఎలా ప్రవర్తించాలి? అంటూ సందేహం వెలిబుచ్చాడు జనకుడు. దానికి అశ్ముడు రాజా! జీవులకు సుఖం, దుఃఖం.. ఏది కలిగినా అనుభవించాల్సిందే! మరో మార్గం లేదు. బంధుమిత్ర గణం, ఆసనం, శయనం, వాహనం, ధనం, కాలానుసారం లభించడం, దూరమవడం.. సహజం వాటి విషయంలో స్వాతంత్ర్యం లేదు. స్వతంత్రులమని భ్రమపడతాం. మనం కేవలం నిమిత్తమాత్రులం.

**కాలఃపచతి భూతాని కాలః సంహరతే ప్రజా**
**కాలః సుప్తేషు జాగర్తి కాలో హవి దురతి క్రమః**

కాలం సర్వప్రాణులకూ పక్వత కలిగిస్తుంది. ప్రజలను నాశనం చేస్తుంది. అందరూ నిద్రపోతుంటే కాలం మెలకువతో ఉంటుంది. కాలాన్ని ఎవరూ అతిక్రమించలేరు అంటూ బదులిచ్చాడు. ప్రాప్తించినది ఏదైనా స్వీకరించి.. మన నిమిత్తమాత్రులం అనుకుని ముందుకు సాగితే జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నది పండిత వాక్య సారాంశం. □

ఆధ్యాత్మికం

# ఉడికించే బాధలుండవిక !




కాయ గూరల్ని ఆవిరిమీద ఉడికించాలంటే ఏం చేస్తాం? ఒక పాత్రలో నీళ్లపోసి.. ఆ పాత్రలోకి సరిగానఫిట్ అయ్యే మరో పాత్రని తీసుకుంటాం. మళ్లీ దాన్లోకి నీళ్లు పోకుండా కింద మరో గిన్నెని బోర్లించాలి. వెజిటబుల్ స్టీమర్ బాస్కెట్ మీ దగ్గరుంటే.. ప్రతి సారీ ఇంత కష్ట పడాల్సిన అవసరం లేదు. ఈ స్టెయిన్‌లెస్ స్టీల్ బాస్కెట్‌ని కావాలంటే వెడల్పు చేసుకోవచ్చు. వద్దనుకుంటే పాత్రకు తగ్గట్టుగా చిన్నదిగా మార్చుకోవచ్చు. రంధ్రాలుండటంవల్ల దీన్లో నీళ్లు చేరే అవకాశం లేదు. ఉడికించిన తర్వాత బాస్కెట్‌ని బయటకు తీయడానికి వీలుగా ఒక హుక్ ఉంటుంది. చేతికి ఆవిరి పట్టకుండా బాస్కెట్‌ని తేలిగ్గా బయటకు తీసుకోవచ్చు. □




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.